Bhavya Sai
PHOTO & VIDEO FILMING
Event Photo & Videography
Best Price
Photos & Videos Delivered
with in 24 Hrs...
Press Events PRO in Vizag
CELL 9948511438

VISAKHA SAMACHARAM TELUGU DAILY: VISAKHAPATNAM
Postal Registration No. VSP / 96/ 2024 - 26.
visit: www.visakhasamacharam.com

# విశాఖ సమాచారమ్

RNI No.52722/90 సంపుటి : 35 సంచిక : 189 విశాఖపట్నం, 9 మే 2025 శుక్రవారం E-mail : vspnews@gmail.com, పేజీలు : 8 వెల : రూ.2.00

విలేఖరులు కావలెను
రాజమండ్రి, చాగల్లు,
నిడదవోలు,
దేవరపల్లి మండలాలకు
విలేకరులు కావలెను.
మేనేజర్
విశాఖ సమాచారమ్
సెల్ : 9100986584, 9553574250

## పునర్విభజన చట్టంలో అమరావతి పేరు



**ప్రతిపాదనకు ఏపీ క్యాబినెట్ ఆమోదం**

**కేంద్రానికి పంపించాలని నిర్ణయం**

**రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులు**

అమరావతి పునర్నిర్మాణ పనులు ప్రారంభించిన ప్రధాని నరేంద్ర మోదీకి క్యాబినెట్ ధన్యవాదాలు తెలిపింది. 47వ సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాజధాని పరిధిలో వివిధ సంస్థలకు భూకేటాయింపులకు ఆమోదం తెలిపింది. తల్లికి ...(మిగతా 2లో)

**అమరావతి, విశాఖ సమాచారం:** పునర్విభజన చట్టంలో విభజిత ఆంధ్రప్రదేశ్ రాజధాని స్థానంలో అమరావతి పేరు చేర్చే ప్రతిపాదనకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అమరావతి పేరును పునర్విభజన చట్టంలో చేర్చేలా చట్ట సవరణ చేయాలని క్యాబినెట్ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని కేంద్రానికి పంపించనున్నారు. అలాగే, ఈ భేటీలో



## ఆపరేషన్ సిందూర్ ఆగదు

**ఇప్పటికి 100 మంది ఉగ్రవాదులు హతం**

**అఖిలపక్ష సమావేశంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడి**



**ఢిల్లీ:** పహల్గాంలో అమాయక పౌరులను పొట్టనబెట్టుకున్న ఉగ్రమూకలపై భారత్ ప్రతీకారం తీర్చుకుంది. సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోన్న పాకిస్థాన్‌కు గట్టిగా బదులు చెప్పింది. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్ర స్థావరాలపై మెరుపు దాడులతో విరుచుకుపడిరది. ఈ 'ఆపరేషన్ సిందూర్'లో కనీసం 100 మంది ఉగ్రవాదులు హతమైనట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడిరచారు. ఈ మేరకు ఆపరేషన్ వివరాలను గురువారం ఆయన అఖిలపక్షానికి తెలియజేశారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుందని ఆయన తెలిపారు. 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించేందుకు కేంద్రం గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించింది. ఇందులో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. "తొమ్మిది ఉగ్ర స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు నిర్వహించాం. దాదాపు 100 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టాం. దీనికి సంబంధించిన మరింత సమాచారం కోసం ఎదురుచూస్తున్నాం. ప్రస్తుతం ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతుందన్న ఈ ఆపరేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఇప్పుడే వెల్లడిరచలేం. ఈ ఉద్రిక్తతలను పెంచాలన్న ఉద్దేశం మాకు లేదు. కానీ, పాక్ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడితే మాత్రం.. వెనక్కి తగ్గేదే లేదు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతుంది" అని వెల్లడిరచారు. పార్లమెంట్ ప్రాంగణంలో రాజ్ నాథ్ సింగ్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో కేంద్రం తరఫున మంత్రులు అమిత్ షా, ఎస్.జైశంకర్, జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. అలాగే విపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, సందీప్ బందోపాధ్యాయ్, టీఆర్ బాలు పాల్గొన్నారు. సమాజ్‌వాదీ పార్టీకి చెందిన రామ్ గోపాల్ యాదవ్, ఆప్ నేత సంజయ్ సింగ్, శివసేన (యూబీటీ) లీడర్ సంజయ్ రౌత్, ఎన్‌సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే, బీజేడీ నేత సస్మిత్ పాత్రా, సీపీఐ(ఎం)కి చెందిన జాన్ బ్రిట్టాస్ భేటీలో పాల్గొన్నారు. జేడి(యూ) నాయకుడు సంజయ్ ఝ, చిరాగ్ పాస్వాన్, మజ్లిస్ అధినేత, ...(మిగతా 2లో)

## పాక్ గగనతల రక్షణ వ్యవస్థలపై విరుచుకుపడ్డ భారత సైన్యం



**ఢిల్లీ:** భారత్ ప్రతీకార దాడులతో బెంబేలెత్తుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. భారత సైనిక స్థావరాలే లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులతో దాడులకు యత్నించిన దాయాదికి చుక్కెదురైంది. ఈ క్రమంలోనే పాకిస్థాన్‌లోని ఆయా ప్రాంతాల్లో మోహరించిన గగనతల రక్షణ వ్యవస్థలను భారత సైన్యం లక్ష్యంగా చేసుకుంది. దీంతో లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసమైనట్లు భారత రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. చైనాకు చెందిన హెచ్‌క్యూ-9 రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తున్న పాకిస్థాన్.. భారత్‌లోని సరిహద్దు రాష్ట్రాల్లో డ్రోన్లు, క్షిపణి దాడులకు యత్నించింది. అవంతిపుర, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపుర్తలా, జలంధర్, అదామ్‌పుర్, భఠిండా, చండీగఢ్, నాల్, ఫలోడి, భుజ్ తదితర ప్రాంతాల్లోని సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకునేందుకు యత్నించింది. అయితే.. వీటిని ఇంటిగ్రేటెడ్ కౌంటర్ యూఏఎస్ గ్రిడ్, గగనతల రక్షణ వ్యవస్థలతో సమర్థంగా అడ్డుకున్నట్లు రక్షణశాఖ వెల్లడించింది. పాకిస్థాన్ దాడులకు రుజువుగా వీటి శకలాలను ఆయా ప్రాంతాల నుంచి సేకరిస్తున్నట్లు తెలిపింది. ఈ క్రమంలోనే భారత్ ప్రతీకార దాడులకు దిగింది. పాకిస్థాన్‌లో వివిధ ప్రాంతాల్లో ఉన్న గగనతల రక్షణ ...(మిగతా 2లో)

## ఎలక్ట్రానిక్స్ పవర్‌హౌస్‌గా ఏపీ



**మంత్రి నారా లోకేశ్**

**తిరుపతి:** ఆవిష్కరణ, పెట్టుబడి కలిసేచోట భవిష్యత్తు రూపుదిద్దుకుంటుందని ఏపీ మంత్రి నారా లోకేశ్ అన్నారు. శ్రీసిటీలో ఎల్జీ ఎలక్ట్రానిక్స్ యూనిట్‌కు శంకుస్థాపన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సృష్టించే ప్రతి ఉద్యోగం, ఆవిష్కరణ ద్వారా ఏపీని ఎలక్ట్రానిక్ పవర్‌హౌస్‌గా మార్చేందుకు బాటలు వేస్తున్నామన్నారు. "ఈరోజు ఎల్జీ యూనిట్‌కు మాత్రమే కాదు.. ఏపీ భవిష్యత్తు కోసం కొత్త పునాదులు వేస్తున్నాం. ఈ కార్యక్రమం ఒక నిర్మాణ ప్రాజెక్టు కంటే పెద్దది. ఇది రాష్ట్రంతో పాటు దేశ పారిశ్రామిక వృద్ధి, సాంకేతిక పురోగతిలో ఒక మైలురాయి. రూ.5వేల కోట్లకు పైగా పెట్టుబడితో రాష్ట్రానికి ప్రపంచస్థాయి తయారీ యూనిట్‌ను ఎల్జీ తీసుకొచ్చింది. 'మేడ్ ఇన్ ఆంధ్రా నుంచి మేడ్ ఫర్ ది వరల్డ్' వరకు మా జైత్రయాత్ర కొనసాగుతుంది" "ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ప్రధాన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల్లో ఒకటిగా శ్రీసిటీ యూనిట్‌లో ఎల్జీ ఆవిష్కృతమైంది. పారిశ్రామిక రంగంలో వేగం, బలమైన మౌలిక సదుపాయాలు, ...(మిగతా 2లో)

## ఏపీ మద్యం కుంభకోణం కేసు వివరాలివ్వండి

**సిట్‌కు ఈడీ లేఖ**

**అమరావతి, విశాఖ సమాచారం:** ఏపీ మద్యం కుంభకోణం కేసును దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ సిద్ధమవుతోంది. వేల కోట్ల రూపాయలు అక్రమ మార్గంలో తరలించారనే ఆరోపణలు రావడంతో ఈడీ రంగ ప్రవేశం చేసేందుకు చర్యలు చేపట్టింది. మద్యం కేసుకు సంబందించిన వివరాలను తమకు అందజేయాలని సిట్ చీఫ్, విజయవాడ ...(మిగతా 2లో)




## మహిళా పోలీస్ అధికారి అరెస్టు!



**విశాఖపట్నం, విశాఖ సమాచారం:** లంచం ఇవ్వాలంటూ బెదిరించిన ఒక మహిళా పోలీస్ అధికారిని అరెస్టు చేశారు. విశాఖ పోలీస్ అనుబంధ ఆర్మ్ డ్ రిజర్వు (ఏఆర్) విభాగంలో ఆర్ఐ (రిజర్వ్ ఇన్స్పెక్టర్)గా పని చేసిన స్వర్ణలతను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. బలగ సుధాకర్ అనే వ్యక్తిని మధురవాడలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పంపించి, తాను ఏసీబీకి చెందిన వ్యక్తినని, రూ.5లక్షలు ఇవ్వకపోతే కేసులు పెడతామని బెదిరించిన కేసులో స్వర్ణలత పాత్ర ఉందని విశాఖ పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించి, గురువారం ఆమెను అరెస్టు చేశారు. సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి ఇచ్చిన ఫిర్యాదుతో పాటు సీసీ కెమెరా ఫుటేజీ, సుధాకర్ మాట్లాడిన ఫోన్ నంబర్ ఆధారంగా ఆమెను అరెస్టు చేశారు. మీరు ఏసీబీకి చెందిన వ్యక్తి అని గ్యారెంటీ ఏంటి అని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది ప్రశ్నించగా, బుధవారం సదరు సుధాకర్ లౌడ్ స్పీకర్ పెట్టి, మా ఏసీబీ జాయింట్ డైరెక్టర్ గారు లైన్లో ఉన్నారంటూ స్వర్ణలతతో మాట్లాడించాడు. స్వర్ణలత స్పందిస్తూ సుధాకర్ చెప్పింది చేయకపోతే ఇబ్బందులు తప్పవంటూ అవతల నుంచి మాట్లాడిన విషయాన్ని కూడా పీఎంపాలెం సీఐ బాలకృష్ణ ఆధారంగా ...(మిగతా 2లో)



## బీజాపూర్‌లో ఎదురు కాల్పులు

8 మంది మావోయిస్టులు మృతి 2

## 27 ఎయిర్ పోర్టులు మూసివేత

**430 విమానాలు రద్దు**

**ఢిల్లీ:** ఉత్తర, పశ్చిమ భారత్‌లో గురువారం మొత్తం 27 ఎయిర్ పోర్టులు మూసివేశారు. 430 విమనాలను రద్దు చేశారు. ఈ ఆంక్షలు మే 10 ఉదయం 5 గంటల 29 వరకూ కొనసాగుతాయని కేంద్రప్రభుత్వం వెల్లడిరచింది. పాక్ ఆక్రమిత ప్రాంతం జమ్మూ కాశ్మీర్ నుంచి గుజరాత్ వరకూ పౌరులు విమాన ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించింది. పాకిస్థాన్ గగన తలం నుంచి ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం ప్రకటించింది. మరోవైపు పంజాబ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లోనూ హై అలర్ట్ ...(మిగతా 2లో)





## నగర ప్రజలకు మంచి పాలన



**జీవీఎంసీ అధికారులకు మేయర్ శ్రీనివాసరావు దిశానిర్దేశం**

**విశాఖపట్నం, విశాఖసమాచారం:** నగరంలో అర్హులైన ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు జీవీఎంసీ యూసీడీ విభాగం సకాలంలో అందించాలని, మహిళల ఆర్థిక పురోగతికి సహకరిస్తూ చిత్తశుద్ధితో అధికారులు విధులు నిర్వహించాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో గురువారం జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్ ఎస్ వర్మ, ప్రాజెక్ట్ డైరెక్టర్ (యు సి డి) సత్యవేణి, ఇతర యూసీడీ అధికారులతో సమీక్షా సమావేశం ...(మిగతా 2లో)

2nd pages11.qxd 5/8/2025 7:39 PM Page 2



# ఆపరేషన్ సిందూర్ ఆగదు



(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి పాల్గొన్నారు.

**రాజకీయాలకు తావులేదు: కిరణ్ రిజిజు**

దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. అఖిలపక్ష సమావేశంలో చర్చించిన విషయాలను మీడియాకు తెలిపారు. "ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు, ఆయన ఆపరేషన్ సిందూర్ గురించి అందరికీ వివరించారు. అలాగే అందరు నాయకులు తమ సూచనలను కేంద్ర ప్రభుత్వానికి అందించారు. దేశం కోసం అందరం కలిసి పనిచేస్తున్న సమయంలో అన్ని పార్టీల నాయకులు తమ పరిణతిని ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్ కోసం అందరూ సాయుధ దళాలను ప్రశంసించడం తో పాటు అభినందించారు. అన్ని పార్టీల నేతలు ప్రభుత్వానికి, సాయుధ దళాలకు మద్దతు ఇస్తామని చెప్పారు. తాజా పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వానికి వారు కొన్ని సూచనలు కూడా చేశారని వాటిని కూడా తమ పరిగణలోకి తీసుకుంటామని రాజ్ నాథ్ సింగ్ చెప్పినట్లు కిరణ్ రిజిజు చెప్పారు. ఆపరేషన్ సిందూర్ వివరాలు, ప్రభుత్వ ఉద్దేశాలను రక్షణమంత్రి ప్రతిపక్ష నేతలకు వివరించారు. అయితే, ఇది కొనసాగుతున్న ఆపరేషన్ గనుక.. సాంకేతిక అంశాలను ఆయన వెల్లడిరచలేకపోయారు. ప్రతిపక్షాలు ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ అంశంలో రాజకీయాలకు తావులేదు అని రిజిజు వెల్లడిరచారు.

**ఐక్యంగా నిలబడుతాం: రాహుల్**

కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. "ఆపరేషన్ సిందూర్‌పై ప్రతిపక్షాలు ఐక్యంగా నిలిచి ప్రభుత్వానికి అండగా ఉంటున్నాం. దేశం కోసం కేంద్రం తీసుకునే చర్యలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నాం. ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని, కొనసాగుతోందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు" అని రాహుల్ పేర్కొన్నారు.

# పునర్విభజన చట్టంలో అమరావతి పేరు

(మొదటి పేజీ తరువాయి)

వందనం, అన్నదాత సుఖీభవ తదితర సంక్షేమ కార్యక్రమాలపై చర్చించింది. తీరప్రాంత భద్రత, రక్షణ రంగ పరిశ్రమల వద్ద జాగ్రత్తలు వంటి అంశాలపై సమీక్ష నిర్వహించింది.

**త్రివిధ దళాలకు అభినందనలు**

ఆపరేషన్ సిందూర్ నిర్వహించిన త్రివిధ దళాలకు క్యాబినెట్ అభినందనలు తెలిపింది. ఆపరేషన్ సిందూర్ అనే పేరు బాగుందని, దేశ ప్రజల భావోద్వేగాలను ప్రతిబింబించేలా ఈ పేరు ఉందని క్యాబినెట్ అభిప్రాయపడిరది. ఇదే తరహాలో రాష్ట్రంలోని పలు సంక్షేమ పథకాలకు మంచి పేర్లు పెట్టేలా దృష్టిపెట్టాలని నిర్ణయించింది. దేశ సరిహద్దుల్లో యుద్ధ వాతావరణానికి సంబంధించి సుదీర్ఘంగా చర్చించారు. విశాఖ, మచిలీపట్నం, నాగాయలంకలలో వంటి ప్రదేశాల్లో భద్రత, కార్యాచరణపై మంత్రులతో సీఎం సుదీర్ఘంగా చర్చించారు. తీర ప్రాంతాల్లో భద్రతకు సంబంధించి జాగ్రత్తగా ఉండాలని మంత్రులకు సీఎం సూచించారు. మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో ఆర్థిక సాయం పెంపు, రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధికి మెగా ఈవెంట్స్ నిర్వహించే ప్రతిపాదనకు అంగీకారం తెలిపింది. మున్సిపల్ శాఖ 281 పనులను హైబ్రిడ్ యాన్యూటీ విధానంలో చేపట్టేందుకు ఆమోదం తెలిపింది. వైకాపా హయాంలో ఆమోదించి కేంద్రం వద్ద పెండిరగ్‌లో ఉన్న 3 చట్టసవరణ బిల్లులను వెనక్కి తీసుకోవాని క్యాబినెట్‌లో నిర్ణయించారు.

# పాక్ గగనతల రక్షణ వ్యవస్థలపై విరుచుకుపడ్డ భారత సైన్యం

(మొదటి పేజీ తరువాయి)

రాడార్‌లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకొని సైన్యం విరుచుకుపడింది. ఈ క్రమంలోనే లాహోర్‌లోని ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ ధ్వంసం అయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. మరోవైపు నియంత్రణ రేఖ వెంట కాల్పుల విరమణ ఉల్లంఘిస్తూ పాకిస్థాన్ దాడులను ముమ్మరం చేసింది. జమ్మూ కశ్మీర్‌లోని రాజౌరీ, మెంధార్, పూంచ్, ఉరి, బారాముల్లా, కుప్వారా ప్రాంతాల్లో మోర్టార్లు, భారీ ఫిరంగులతో దాడులుచేస్తోంది. వీటిలో ఇప్పటివరకు 16 మంది సామాన్య పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

# ఎలక్ట్రానిక్స్ పవర్‌హౌస్‌గా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ భవిష్యత్తుపై సీఎం చంద్రబాబు నిబద్ధతకు ఇది అద్దం పడుతోంది. సులభతరమైన వ్యాపారానికి హామీ ఇవ్వడంతో పాటు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాలను అనుసరిస్తున్నాం" అని లోకేశ్ అన్నారు.

# ఏపీ మద్యం కుంభకోణం కేసు వివరాలివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

నగర పోలీస్ కమిషనర్‌కు ఈడీ లేఖ రాసింది. మనీలాండరింగ్ నిరోధక చట్టం- 2002 ప్రకారం కేసు దర్యాప్తు చేస్తామని ఈడీ లేఖలో పేర్కొంది. మద్యం కుంభకోణంపై సీఐడి అధికారులు నమోదు చేసిన 21/2024 ఎఫ్‌ఐఆర్‌కి సంబంధించిన వివరాలు ఇవ్వాలని ఈడీ కోరింది. సీఐడి నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ సర్టిఫైడ్ కాపీ ఇవ్వాలని లేఖలో తెలిపింది. ఈ కేసుతో సంబంధం ఉందని ఇప్పటివరకు దర్యాప్తు అధికారులు గుర్తించిన వారి బ్యాంకు ఖాతాలు, ఆస్తుల వివరాలు అందజేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోరింది. ఇప్పటివరకు ఈ కేసులో అరెస్ట్ చేసిన నిందితుల వివరాలు, రిమాండ్ రిపోర్టులు తమకు అందజేయాలని కోరింది. ఈ కేసులో అరెస్టయిన నిందితులపై అభియోగపత్రం నమోదు చేస్తే వాటి కాపీలను సైతం ఇవ్వాలని లేఖలో కోరింది.

# ఏపీ మద్యం కేసులో నిందితులకు సుప్రీంలో ఎదురు దెబ్బ

**దిల్లీ:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో ముగ్గురు నిందితులకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కృష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, బాలాజీ గోవిందప్పకు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. వాదనల సందర్భంగా.. హైకోర్టులో విచారణ జరుగుతున్నప్పుడే నిందితులు సుప్రీం కోర్టులో మధ్యంతర బెయిల్ పిటిషన్ దాఖలు చేశారని ఏపీ ప్రభుత్వం తరపు న్యాయవాది ముకుల్ రోహత్గి తెలిపారు. ఆ పిటిషన్ ఇప్పుడు విచారణార్హం కాదని పేర్కొన్నారు. హైకోర్టు తాజాగా ముందస్తు బెయిల్ నిరాకరించినందున నిందితులు గతంలో దాఖలు చేసిన పిటిషన్‌ను సవరించాలని.. లేదా కొత్త పిటిషన్‌ను దాఖలు చేయాల్సి ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. ఈక్రమంలో కొత్తగా మరోసారి పిటిషన్ దాఖలు చేయడానికి అనుమతివ్వాలని ధర్మాసనాన్ని నిందితులు కోరగా.. జస్టిస్ పార్దీవాలా ధర్మాసనం




అనుమతించింది. మరోవైపు ఈ నెల 13వ తేదీ వరకైనా మధ్యంతర రక్షణ కల్పించాలని నిందితుల తరపు న్యాయవాదులు అభ్యర్థించారు. మధ్యంతర రక్షణ ఇవ్వడం కుదరదని ధర్మాసనం తేల్చిచెప్పింది. మిమ్మల్ని మీరే రక్షించుకోవాలని వ్యాఖ్యానించింది. అనంతరం తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

**అసలేం జరిగిందంటే..**

వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణంలో.. నాటి సీఎంవో కార్యదర్శి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ పూర్తికాలపు డైరెక్టర్ గోవిందప్ప బాలాజీలను ఇటీవల సిట్ నిందితులుగా చేర్చింది. ఇప్పటివరకూ 30 మందిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు. ముడుపుల వసూళ్లకు వీలుగా మద్యం విధానాన్ని సిద్ధం చేయాలనే కుట్రకు రూపకల్పన, ముడుపుల వసూళ్ల నెట్‌వర్క్ నిర్వహణలో అప్పటి ప్రభుత్వ పెద్దల తరపున కీలక పాత్ర పోషించిన ప్రధాన నిందితుడు(ఏ1) రాజ్ కెసిరెడ్డి, వైసీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఆ పార్టీ మాజీ నేత వి.విజయసాయిరెడ్డి తదితరులతో కలిసి ఈ ముగ్గురూ కుంభకోణంలో అన్ని స్థాయుల్లోనూ భాగస్వాములయ్యారని, మద్యం సిండికేట్‌లో వీరిదీ ప్రధాన పాత్రేనని సిట్ ఇప్పటికే గుర్తించింది.

**సిట్ అధికారుల సోదాలు**

విజయవాడలోని వెటర్నరీ కాలనీలో సిట్ అధికారులు సోదాలు చేపట్టారు. జగన్‌కు అప్పటి కార్యదర్శి ధనుంజయరెడ్డి, ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, వ్యక్తిగత కార్యదర్శి కేవీఎస్‌ఆర్ నివాసాల్లో తనిఖీలు చేశారు.

# శ్రీవారి భక్తులకు సాంప్రదాయ వంటకాలు

## - టీటీడీ అదనపు ఈవో



**తిరుమల, విశాఖ సమాచారం:** తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు వివిధ రాష్ట్రాలకు చెందిన సాంప్రదాయ వంటకాలను అందించాలని, ఎలాంటి అసౌకర్యం కలగకుండా హోటళ్లలో పరిశుభ్రత, నిర్వహణ చక్కగా ఉండేలా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి కోరారు. తిరుమలలోని ఆస్థానమండపంలో గురువారం హోటళ్ల నిర్వాహకులు, స్థానికులతో అదనపు ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, భక్తుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన ఆహార పదార్థాలను భక్తిశ్రద్ధలతో అందించాలన్నారు. తిరుమల యాత్ర భక్తులకు ఒక మధురానుభూతిని కల్పించాలన్నారు. హోటల్ నిర్వాహకులు చేసే చిన్న చిన్న పొరపాట్ల వల్ల భక్తులు చాలా అసంతృప్తితో వెళుతున్నారని చెప్పారు. హోటళ్ల యజమానులు చట్టబద్ధమైన నియమ నిబంధనలను పాటించాలని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రపరచుకోవాలన్నారు. టీటీడీ ఆరోగ్య విభాగం ప్రతిరోజు చేయవలసిన పనులతో కూడిన చెక్లిస్ట్ అందిస్తుందని, దానిని తప్పకుండా పాటించాలన్నారు. టీటీడీలోని అన్ని విభాగాల అధికారులు ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. తిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంతో పాటు భక్తుల రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో 33 అన్నప్రసాద కౌంటర్లలో టీటీడీ నాణ్యమైన భోజనం అందిస్తుందన్నారు. అదేవిధంగా భగవంతుని సన్నిధిలోని హోటళ్ల యజమానులు కూడా మంచి తినుబండారాలు అందించాలన్నారు. భక్తుల ఆరోగ్యానికి హానికరమైన చైనీస్ వంటకాలను పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. హోటల్లో నిర్వాహకులు, పనిచేసే సిబ్బంది సంప్రదాయ వస్త్రధారణ ధరించి భక్తులకు సేవలందించాలని, ముఖ్యంగా తెలుగు సాంప్రదాయం ఉట్టిపడాలన్నారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. హోటల్లో వద్ద ట్రేడ్ లైసెన్స్, జిఎస్టి వంటి ధ్రువీకరణ పత్రాలను అధికారులకు కనిపించేలా డిస్ప్లే చేయాలన్నారు. భక్తులు డిజిటల్ పేమెంట్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.

హోటల్ నిర్వహణ లైసెన్స్‌ను నిర్ణీత సమయంలో రెన్యువల్ చేసుకోవాలన్నారు. అన్ని దుకాణాలలో ధరల పట్టికను ప్రదర్శించాలని చెప్పారు. ఆహార పదార్థాలు తయారు చేసేటప్పుడు సిలిండర్ ఏర్పాటు చేసే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సంబంధిత అధికారులు నడిగి తెలుసుకోవాలన్నారు. హోటళ్ల లోని వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని, హోటల్లో యజమానులు సమిష్టిగా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. భక్తులకు సురక్షితమైన తాగునీరు అందించాలన్నారు నీరు, విద్యుత్ వృధా కాకుండా వినియోగించుకోవాలని చెప్పారు. త్వరలో ఐదు నుంచి 10 హోటళ్లలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధి విధానాలు అమలు అయ్యేలా నిర్వాహకులు సహకరించాలన్నారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలను టీటీడీ అధికారులు అందిస్తారని వివరించారు. అనంతరం హోటళ్ల నిర్వాహకులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను అదనపు ఈవోకి వివరించారు. సమావేశంలో అన్న ప్రసాదం డిప్యూటీ ఈవో రాజేంద్ర కుమార్, ఆరోగ్య విభాగం డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, ఎస్టేట్ అధికారి వెంకటేశ్వర్లు, అన్నప్రసాదం ప్రత్యేక అధికారి శాస్త్రి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాఖండ్‌లో కూలిన హెలికాప్టర్

## మృతుల్లో అనంతపురం ఎంపీ సోదరి

**అనంతపురం, విశాఖ సమాచారం:** ఉత్తరాఖండ్‌లో జరిగిన ఘోర హెలికాప్టర్ ప్రమాదంలో మృతుల సంఖ్య ఆరుకి చేరింది. వీరిలో ఇద్దరు ఏపీ వాసులు ఉన్నారు. మరొకరు గాయపడ్డారు. అనంతపురం ఎంపీ లక్ష్మీనారాయణ సోదరి వేదవతితో పాటు విజయారెడ్డి అనే మహిళ ఈ ప్రమాదంలో మృతిచెందినట్లు అధికారులు నిర్ధరించారు. వేదవతి భర్త భాస్కర్ గాయాలతో బయటపడ్డారు. దీంతో ఆయన్ను చికిత్స నిమిత్తం రుషికేశ్ ఎయిమ్స్‌కు తరలించారు. గురువారం ఉదయం పర్యాటకులతో వెళు_న్న ఓ ప్రైవేటు హెలికాప్టర్ కుప్పకూలిపోయింది. ఉత్తరకాశీలో గంగోత్రి వైపు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి



చేరుకున్నారు. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ఏడుగురు ప్రయాణికులు ఉన్నారు.

# నగర ప్రజలకు మంచి పాలన

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఎన్నో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, వాటిని సక్రమంగా అర్హులైన ప్రజలకు అందించి ప్రభుత్వానికి, జీవీఎంసీకి మంచి పేరుతో పాటు మంచి పాలన అందించేందుకు అధికారులు సహకరించాలని కోరారు. నగరంలో ఏ ఏ కేటగిరీలో ఎన్ని ప్రభుత్వ పింఛన్లు పంపిణీ చేస్తున్నారని ఆరా తీశారు. నైట్ షెల్టర్లను రాత్రి 11 గంటల తర్వాత అధికారులు తనిఖీలు నిర్వహించాలన్నారు. నగరంలో ఉన్న 25 అన్నా క్యాంటీన్లను అధికారులు సందర్శించి భోజనం నాణ్యతను పరిశీలించాలని, నైట్ షెల్టర్ల తో పాటు అన్న క్యాంటీన్లను ఆకస్మికంగా తాను తనిఖీలు నిర్వహిస్తానని అధికారులకు మేయర్ తెలిపారు. అన్న క్యాంటీన్లో భోజనం చేసి భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలిస్తానన్నారు . నగరంలో నిర్మించిన టిడ్కో గృహాలలో అనర్హులు ఉన్నారని చాలాచోట్ల టిడ్కో గృహాలు ఖాళీగా ఉన్నాయని మొత్తం టిడ్కో గృహాల జాబితా వాటి వివరాలు అందించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసిడి)ని ఆదేశించారు. కొంతమంది ఆర్పీలపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఎటువంటి ఫిర్యాదులు లేకుండా ప్రజలకు మంచి సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్లు డి.లక్ష్మీ, సూర్యకళ, డీపీఓలు హనుమంతు శంకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# హైజాక్ మాస్టర్‌మైండ్ అబ్దుల్ రవూఫ్ అజహర్ హతం

**దిల్లీ:** ఆపరేషన్ సిందూర్‌లో భారత్ చిరకాల ప్రతీకారం కూడా తీరింది. 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం ఐసీ-814 హైజాక్‌కు మాస్టర్‌మైండ్, జైషే ఉగ్రవాది అబ్దుల్ రవూఫ్ అజహర్ కూడా హతమయ్యాడు. బహావల్‌పుర్‌లోని మర్కజ్ సుబాన్ కాంప్లెక్స్‌పై భారత్ విరుచుకు పడింది. ఈ దాడిలో జైషే మొహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ కుటుంబ సభ్యులు, సన్నిహితులు కలిపి 14 మంది మరణించారు. వీరిలో రవూఫ్ అజహర్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ దాడిలో అజహర్ సోదరి, ఆమె భర్త, మేనల్లుడు, అతడి భార్య సహా పలువురు మృతి చెందినట్లు చెబుతున్నారు. రవూఫ్ అజహర్ పలు ఉగ్రదాడుల్లో నిందితుడు. వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక జర్నలిస్టు డేనియల్ పెర్ల్ హత్యలో ఇతడు కూడా ఉన్నాడు. 2002లో ఉగ్రవాదంపై రీసెర్చి చేస్తున్న పెర్ల్ కొంత మంది మతపెద్దలను కలిసేందుకు పాక్‌లోని కరాచీకి వెళ్లాడు. కాందహార్ హైజాక్ సందర్భంగా ఉగ్రవాదులు



విడిపించిన ఒమర్ షేక్ ఓ హోటల్ నుంచి పెర్ల్‌ను కిడ్నాప్ చేసి హత్య చేశాడు. 1999లో జరిగిన ఐసీ814 విమాన హైజాక్‌లో కూడా రవూఫ్ అజహర్ హస్తం ఉంది. ఐదుగురు పాక్ ఉగ్రవాదులు నేపాల్‌లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని హైజాక్ చేసి కాందహార్‌కు చేర్చారు. అక్కడి నుంచి భారత ప్రభుత్వంతో చర్చలు జరిపి.. భారత జైళ్లలో ఉన్న మసూద్ అజహర్, అహ్మద్ ఒమర్ సయీద్ షేక్, ముస్తాక్ అహ్మద్ జర్గర్ అనే ఉగ్రవాదులను విడిపించుకొని తీసుకెళ్లారు. ఆ తర్వాతే మసూద్ అజహర్ జైషే ఉగ్రవాద సంస్థను స్థాపించాడు. ఇక 2001లో జరిగిన పార్లమెంట్‌పై దాడి, 2016లో పఠాన్ కోట్ దాడి, 2019లో పుల్వామా బాంబింగ్ వంటి ఉగ్ర ఘటనల్లో రవూఫ్ ప్రమేయం ఉంది. ప్రస్తుతం జైషే మొహమ్మద్ కీలక కమాండర్‌గా వ్యవహరిస్తున్నాడు.

# మహిళా పోలీస్ అధికారి అరెస్టు!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నారు. సుధాకర్ ఫోన్ చేసిన నంబర్ను తీసుకుని వివరాలు ఆరా తీయగా స్వర్ణలత చిరునామా, వివరాలు లభించాయి. దీంతో నకిలీ ఏసీబీ అధికారి సుధాకర్‌ను బుధవారం అరెస్టు చేసిన పోలీసులు గురువారం స్వర్ణలతను అరెస్టు చేశారు.

**గతంలోనూ నేర చరిత్ర**

యూనిఫాం వేసుకుని స్వర్ణలత ఎన్నో దారుణాలకు పాల్పడ్డారు. నోట్ల రద్దు సమయంలో తనకున్న అధికారాన్ని ఉపయోగించుకుని స్వర్ణలత విశాఖకు చెందిన ఓ ప్రజాప్రతినిధి వద్ద ఉన్న బ్లాక్ మనీ, పెద్ద నోట్లను 30శాతం కమిషన్ ఇస్తే మార్పిస్తానంటూ ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ నేపథ్యంలో రద్దయిన పెద్దనోట్లను స్వర్ణలత స్వయంగా తన కారులోనే పెట్టి బయటకు వస్తున్న సమాచారంపై ద్వారకా పోలీసులు కాపుగాసి పట్టుకున్నారు. ఆ కేసులో స్వర్ణలతతో పాటు ఆమె డ్రైవర్ హోంగార్డు, మరో కానిస్టేబుల్పైనా కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. ఆ కేసులో స్వర్ణలత బృందం జైలుకు వెళ్లొచ్చింది. ఆ తర్వాత సస్పెన్షన్ అనంతరం పోస్టింగ్లో భాగంగా ఆమెను గుంటూరు ఏఆర్ కు ఉన్నతాధికారులు బదిలీ చేశారు. స్వర్ణలత తాజా అరెస్టు విషయం పోలీస్ శాఖలో చర్చనీయాం శమైంది. సినిమాల్లో నటించాలన్న ఆకాంక్షతో పోలీస్ యూనిఫాంతోనే స్వర్ణలత అనేక దారుణాలకు ఒడిగట్టినట్లు తెలిసింది. గతంలో ఆమె పోలీస్ అధికారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా కూడా పని చేశారు. గతంలోనూ ఆమె పలు ప్రభుత్వ కార్యాలయాలకు పంపించి లంచం డిమాండ్ చేయించారన్న ఆరోపణలున్నాయి.

# 27 ఎయిర్ పోర్టులు మూసివేత

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. ఈ మేరకు సరిహద్దు ప్రాంతాలు, ఎయిర్ పోర్టులు, విద్యాసంస్థలు మూసివేశారు. దీంతో విద్యాసంస్థల నుంచి అక్కడి పౌరులు విద్యార్థులను ఇళ్లకు తీసుకుపోతున్నారు. అటు ఆపరేషన్ సిందూర్ భారత సరిహద్దులో కొనసాగుతోంది. పహల్గాం దాడికి ప్రతీకారంగా భారత ప్రభుత్వం ఉగ్రవాదుల స్థావరాలపై యుద్ధం ప్రకటించింది. క్షిపణులు, బాంబు దాడులతో ఉగ్రవాదుల శిబిరాలను ధ్వంసం చేసోంది. ఈ దాడుల్లో పలువురు ఉగ్రవాదుల హతం అయ్యారు. దీంతో పాకిస్థాన్ సైన్యం భారత సరిహద్దు గ్రామాలపై బాంబు దాడులకు పాల్పడుతోంది. ఉగ్రవాద శిబిరాలపై భారత్ దాడులు చేస్తుంటే.. పాకిస్థాన్ మాత్రం ఎల్‌వోసీ వెంబడి అమాయక ప్రజలపై మోర్టార్ బాంబు దాడులకు పాల్పడుతోంది. ఈ నేపథ్యంలో దేశంలో పలు ప్రాంతాల్లో భారత ప్రభుత్వం హైఅలర్ట్ ప్రకటించింది. పోలీసులకు సెలవులు రద్దు చేసింది. బహిరంగ సమావేశాలపైనా ఆంక్షలు విధించింది. పాకిస్థాన్ వైపు నుంచే విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చింది.

# బీజాపూర్‌లో ఎదురు కాల్పులు.. 8మంది మావోయిస్టులు మృతి

**బీజాపూర్:** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ సరిహద్దుల్లో భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య భారీ ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. గురువారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఎనిమిది మంది మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న, మావోయిస్టు ఎస్‌జెడ్‌సీఎం బండి ప్రకాశ్ ఉన్నట్లు సమాచారం. చంద్రన్న తలపై రూ.కోటి రివార్డు ఉంది. బీజాపూర్ జిల్లా ఉసూర్ ప్రాంతంలోని లంకపల్లె అడవుల్లో ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి.

2nd pages11.qxd 5/8/2025 7:39 PM Page 3



# పార్టీ కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే వంశీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** గురువారం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అనారోగ్యంతో ఇంటివద్ద చికిత్స పొందుతున్న 29వ వార్డు తెలుగుదేశం బూత్ అధ్యక్షులైన పల్లా మధు, అక్కరమాని సూరిబాబుని వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ధైర్యంగా ఉండాలని తనవంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.మెరుగైన వైద్యం అందేలా సహాయ సహకారాలు చేస్తానని , ముఖ్య మంత్రి గారి సహాయ నిధి వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తానని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో 29వ వార్డు ఇంచార్జి దువ్వి గోవిందరావు, 29వ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణ రావు, 29వ వార్డు మాజీ కార్పొరేటర్ బుద్ధల అనురాధ, జనసేన పార్టీ నేతలు మన్యాల శ్రీనివాస్ రావు, 29 జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్ కుమార్, భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు దేవాడ శేఖర్,తెలుగుదేశం నాయకురాలు నర్సయమ్మ, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

# ట్రైన్ ప్రయాణీకుల దాహార్తిని తీర్చిన శ్రీ సత్య సాయి సేవా సమితి



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఈ మండువేసవిలో దూర ప్రయాణాలు చేసే దాహార్తుల దాహం తీర్చే నిమిత్తం దువ్వాడ రైల్వే శాఖ వారు ఉక్కు నగరం శ్రీ సత్యసాయి సేవా సమితి జెంట్స్ సేవాదళ్ వారి సేవలను వినియోగించుకొనుటకు అభ్యర్థించడ మైనది. ఈ రోజు (08/05/25- గురువారం) దువ్వాడ రైల్వే రైల్వే స్టేషన్ లో ప్రశాంతి ఎక్స్ప్రెస్ ట్రైన్ లోని ప్రయాణీకులకు, ముఖ్యంగా జనరల్ కంపార్ట్మెంట్ లోని ప్రయాణీకులకు 600 వాటర్ బాటిల్స్ శ్రీ సత్య సాయి సేవా సంస్థల సేవాదళ్ సభ్యులు, సేవాదళ్ ప్రేమతో అందచేశారు.

ఈ సేవా కార్యక్రమాన్ని ఉక్కునగరం సత్య సాయి సేవా సమితి కన్వీనర్ జి రామకృష్ణ, జాయింట్ కన్వీనర్ శ్రీ ఎస్ కె ఆర్ కె రాజు సమన్వయపరిచారు.

ఈ ప్రత్యేక సేవా కార్యక్రమంలో పైడి నాయుడు, అగనంపూడి భజన మండలి కన్వీనర్, జి.వి.ప్రసాద్, రాజీవ్ నగర్ భజన మండలి కన్వీనర్, ఉక్కునగరం శ్రీ సత్య సాయి సేవా సమితికి చెందిన కర్రి శ్రీనివాస్, సన్యాసిరాజు, ఇతర సేవాదళ్ సభ్యులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# సింహగిరికి చేరుకున్న లక్ష్మీకాంత్ నాయక్‌దాస్



**సింహాచలం, (విశాఖ సమాచారమ్):-** ఒడిశాకు చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ బుధవారం తన పరివారంతో సింహగిరికి తరలివచ్చారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులకు తులసి ప్రసాదాన్ని అందించారు. తదుపరి సింహగిరిపై ఉన్న దాసుడి సత్రానికి బసచేసేందుకు తరలివెళ్లారు. మూడు నెలలపాటు సింహగిరిపై ఉండి స్వామికి సేవలందించనున్నారు. ఒడిశాలోని పట్టుపురానికి చెందిన దాసుల కుటుంబం తరతరాలుగా సింహాచలేశుడి సేవలో తరిస్తోంది. ఏటా సుమారు మూడు నెలలపాటు సింహగిరిపైనే ఉంటూ స్వామిని సేవించడం పరిపాటి. ఈ మూడు నెలల్లో వీరి ఆధ్వర్యంలో ఒడిశా రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు సింహగిరికి తరలివచ్చి అప్పన్న స్వామిని దర్శించుకుంటారు. దాసుడి ఆధ్వర్యంలో స్వామికి ఆర్జిత సేవలు విశేషంగా జరిపిస్తారు. ఈ సేవల్లో పాల్గొనేందుకు అధిక సంఖ్యలో ఒడిశా భక్తు లు ఆయా రోజుల్లో సింహగిరికి తరలివస్తారు. తన తండ్రి వనమాలిక్ నాయక్‌దాస్ మరణానంతరం 2008 నుంచి లక్ష్మీకాంత్ శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామిని సేవించే బాధ్యతలు స్వీకరించారు.

# రామజోగయ్య శాస్త్రికి ఆత్రేయ పురస్కారం

రామజోగయ్యశాస్త్రిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తదితరులు




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ప్రముఖ సినీ గీత రచయిత రామజోగయ్య శాస్త్రికి కవి కుల కిరీటి ఆత్రేయ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. ఆచార్య ఆత్రేయ 104వ జయంతి సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రామజోగయ్య శాస్త్రికి ఆత్రేయ పురస్కారాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ చేతుల మీదుగా అంద జేశారు. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ గురువు సిరివెన్నెలను స్ఫూర్తిగా తీసుకుని అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చే గీతాలు రాస్తున్న మహోన్నత వ్యక్తి రామజోగయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఆత్రేయ కళాపీఠం కార్యదర్శి గంటి మురళి, పోర్ట్ ట్రస్ట్ కార్యదర్శి టి.వేణుగోపాల్, ప్రముఖ రచయితలు మా శర్మ, ఎర్రాప్రగడ రామకృష్ణ, బీజేపీ నాయకులు డాక్టర్ సుహాసినీ ఆనంద్, కొణతాల రాజు, చెన్నా తిరుమలరావు పాల్గొన్నారు.


## ఈస్ట్ కోస్ట్ రైల్వే

(1) ప్రకటన నెం. eT-North-WAT-12-2025, తేదీ. 05.05.2025

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/లక్ష్మీపూర్ రోడ్ వారి పరిధిలోని కోరాపుట్-రాయగడ లైను పైన భాలుమస్కా-సికరపాయ్ మధ్యన కి.మీ. 132/21-22 ట్రెస్ పాసింగ్ ప్రదేశం వద్ద పరిమిత ఎత్తు సబ్ వే (LHS) నిర్మించుట.

**సుమారు పని విలువ:** ₹ 2,34,09,279.13, **బయానా:** ₹ 2,67,100/-.

(2) ప్రకటన నెం. eT-North-WAT-13-2025, తేదీ. 05.05.2025

**పని పేరు:** వాల్తేరు డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీరు/రాయగడ వారి పరిధిలోని రాయపూర్-విజయనగరం లైను పైన సింగపురం రోడ్-తెరుబలి మధ్యన కి.మీ. 330/20-22 ట్రెస్ పాసింగ్ ప్రదేశం వద్ద పరిమిత ఎత్తు సబ్ వే (LHS) నిర్మించుట.

**సుమారు పని విలువ:** ₹ 4,24,49,610.64, **బయానా:** ₹ 3,62,300/-.

పని పూర్తి చేయు కాలం: 12 (పన్నెండు) నెలలు (రెండు వరుస నెంబర్లకు కొరకు).

**టెండరు ముగింపు తేదీ మరియు సమయం:** 29.05.2025న 1500 గంటలకు (రెండు టెండర్లు కొరకు).

ఇందుకు సంబంధించి మాన్యువల్ ఆఫర్లు ఇ-టెండర్లకు సంబంధించి పోస్టు / కొరియర్ / ఫ్యాక్స్ లేదా స్వయంగా తమ సంస్థ లెటర్ హెడ్స్ పైన, సకాలంలో అందునట్లు పంపినప్పటికి అంగీకరించబడవు. అట్టి అన్ని మాన్యువల్ ఆఫర్లు చెల్లుబాటు కానివిగా పరిగణించవడతాయి మరియు ఎలాంటి పరిశీలన లేకుండానే తిరస్కరించబడతాయి.

పై ఇ-టెండరుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇ-టెండరు డాక్యుమెంట్లతో పాటు www.ireps.gov.in వెబ్‌సైట్ నందు లభిస్తాయి.

సూచన: విశ్వసనీయ టెండరుదారులు ఈ టెండరుకు సంబంధించి ఏదైన మార్పులు / సవరణలు కోసం టెండరు ముగింపు తేదీకి 15 (పదిహేను) రోజులు ముందుగా ఈ టెండరును మరొకసారి చూడవలసినదిగా సలహానీయటమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇంజనీరింగ్) వాల్తేరు

PR-105/Q/25-26


# ఘనంగా శ్రీఅయ్యప్ప స్వామి విగ్రహ పునః ప్రతిష్ట



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** నర్సీపట్నం అయ్యప్ప స్వామి దేవాలయంలో శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ పునః ప్రతిష్ట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం లో స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి తో పాటు, వారి కుమారుడు చింతకాయల రాజేష్ కోడలు దివ్యశ్రీతో కలిసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారుజాము 5 గంటలకు సంకల్పం, యంత్ర పూజ, గర్త న్యాసం, రత్న న్యాసం, ద్రవ్య నిక్షేపణం కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. అనంతరం ఉదయం 6:54 నిమిషాలకు ఉత్తర నక్షత్రం వృషభ లగ్నములో యంత్ర విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాసం, జీవన్యాసం, కుంభాభిషేకం, దీక్షావిమోకము, ధ్వజావరోహణం, శాంతిపఠనం తదితర శాస్త్రీయ కార్యక్రమాలలో స్పీకర్ దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు వేద మంత్రాలతో స్పీకర్ దంపతులను ఆశీర్వదించారు. అనంతరం గౌరవ స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం మూడు రోజులపాటు అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా, శైవ ఆగమ సంప్రదాయంలో తూర్పుగోదావరి జిల్లా పెదపర్తికి చెందిన యలమంచు కృష్ణమూర్తి శివాచార్య నేతృత్వంలో నిర్వహించబడిందని చెప్పారు.

40 సంవత్సరాల క్రితం కీర్తిశేషులు పెదిరెడ్ల సత్యనారాయణ సహకారంతో తన మిత్రబృందం కలిసి ఆలయ నిర్మాణం చేపట్టారని, అప్పట్లో కూడా యలమంచు కృష్ణమూర్తి శివాచార్య చేతుల మీదుగానే ప్రతిష్ఠా కార్యక్రమం నిర్వహించబడిందని గుర్తు చేశారు. ఇప్పుడు మళ్లీ వారి చేతుల మీదుగానే విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించబడటం ఎంతో ఆనందంగా ఉందన్నారు.అయ్యప్ప స్వామి విగ్రహంతో పాటు దుర్గమ్మ అమ్మవారి విగ్రహాన్ని ఆలయానికి తానే అందించానని, మిగతా కార్యక్రమాలు భక్తుల సహకారంతో నిర్వహించబడ్డాయని తెలిపారు. అనంతరం స్పీకర్ దంపతులు యలమంచు కృష్ణమూర్తి, శివాచార్యలను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# చల్లని కబురు



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** దేశమంతా భానుడి భగభగలతో మండుతున్న వేళ భారత వాతావరణ శాఖ (ఐఎండీ)చల్లని కబురు అందించింది. ముందుగానే ఊహించినట్టు నైరుతి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నట్టు ఐఎండీ అంచనా వేస్తోంది. మే 13న రుతుపవనాలు అండమాన్ సముద్రంలోకి ప్రవేశించనున్నట్టు ఐఎండీ ప్రకటించింది. 13 సాయంత్రం నాటికి అండమాన్ సముద్రంతో పాటు దానికి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలోకి నైరుతి ప్రవేశించనుంది. సాధారణంగా రుతుపవనాలు మే 20 తర్వాతే అక్కడికి చేరుకుంటాయి.

కానీ.. ఈసారి వాతావరణ పరిస్థితులు పూర్తి అనుకూలంగా ఉండటంతో వారం ముందుగానే ఆగ్నేయ బంగాళాఖాతానికి రాబోతున్నాయి. రుతుపవనాల రాకకు వాతావరణం కలిసొస్తే జూన్ మొదటి వారంలోనే కేరళని తాకే అవకాశం ఉంది. ఈసారి నైరుతి కాలంలో సాధారణం కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఐఎండీ అధికారులు అంచనా వేస్తున్నారు. ఇదిలా ఉండగా రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు వర్ష సూచనలు కనిపిస్తున్నాయి.

దక్షిణ తెలంగాణ, పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం, తెలంగాణ నుంచి రాయలసీమ, తమిళనాడు మీదుగా ఉపరితల ద్రోణి కొనసాగుతున్నాయి. వీటి ప్రభావంతో గురు, శుక్రవారాల్లో కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రాయలసీమ, దక్షిణ కోస్తా జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షం పడే సూచనలున్నాయని పేర్కొన్నారు. ఈదురు గాలుల తీవ్రత కొనసాగుతుందని.. గంటకు 40 నుంచి 50 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని ఆంధ్ర ప్రదేశ్ అధికారులు తెలిపారు.

# ఉచిత గ్యాస్.. రెండో విడతకే తుస్!

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం రెండో విడత లబ్ధిదారులకు కష్టాలు మొదలయ్యాయి. తొలి విడత గ్యాస్ సబ్సిడీ డబ్బులు ఖాతాల్లో జమయ్యాయి. రెండో విడతలో గ్యాస్ తీసుకున్న లబ్ధిదారులు రాయితీ డబ్బులు రాలేదని లబోదిబోమంటున్నారు. గ్యాస్ తీసుకుని రోజులు గడుస్తున్నా.. తమ ఖాతాల్లో సబ్సిడీ జమ చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సివిల్ సప్లయ్ అధికారుల్ని అడుగుతుంటే.. ఈ రోజు, రేపు అంటూ మాట దాటేస్తున్నారని వాపోతున్నారు.

**మెలికల మీద మెలికలు**

కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ప్రతి ఒక్కరికీ ఏడాదిలో మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. అయితే ఇప్పుడు మెలికల మీద మెలికలు పెడుతున్నారు. ఉచిత సిలిండర్లు రావాలంటే రైస్ కార్డు తప్పనిసరి అని మెలిక పెట్టారు. దీంతో మధ్య తరగతి మహిళలు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. ఎన్నికల ముందు ఒకలా.. ఇప్పుడు మరోలా కూటమి ప్రభుత్వం మాట మార్చిందని ఆక్షేపిస్తున్నారు. తెల్ల రేషన్ కార్డు మనుగడలో ఉంటేనే ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలెండర్లు దక్కనున్నాయి. రేషన్ కార్డు పనిచేయకపోతే ఈ పథకానికి నోచుకోలేరు. అలాగే ఈకేవైసీ కూడా తప్పనిసరి. వీటిలో ఏ తేడా వచ్చినా గ్యాస్ సొమ్ము దక్కడం కష్టంగా మారింది.

**మొదలైన రాయితీ తిప్పలు**

ఉచిత గ్యాస్ సిలెండర్లు పథకం అమల్లో భాగంగా మొదటి విడత పూర్తి అయ్యింది. రెండో విడత ఏప్రిల్ ఒకటి నుంచి మొదలైంది. గ్యాస్ బుకింగ్ ప్రారంభించి, డెలివరీ కూడా చేస్తున్నారు. ఇందుకు ఎల్‌పీజీ కనెక్షన్, తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు తప్పనిసరి చేశారు. ఇవన్నీ ఉంటేనే ఈ పథకం అమలు చేస్తున్నారు. అలా గ్యాస్ సరఫరా అయిన వారికి కూడా చేస్తున్నా.. సబ్సిడీ డబ్బులు మాత్రం చాలా మంది ఖాతాలకు జమ కావడం లేదని మహిళలు వాపోతున్నారు.

**జిల్లాలో వివరాలు**

గ్యాస్ వచ్చింది, డబ్బులు రాలేదు

బుకింగ్ చేసిన కొద్ది రోజులకు వంట గ్యాస్ అయితే వచ్చింది. కానీ డబ్బులు ఇంకా రాలేదు. అడిగితే గాబరా వద్దు.. వస్తాయని సమాధానం చెబుతున్నారు. ఎప్పుడు వస్తాయని అడిగితే మాత్రం ఈకేవైసీ అయిందా అని ఆరా తీస్తున్నారు. డబ్బులు మీ బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయని చెప్పి తప్పించుకుంటున్నారు.

# ఉత్సాహంగా ఎడ్ల బండ్ల పోటీలు

## ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు



**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** మున్సిపాలిటీలోని బలిఘట్టం గ్రామంలో శ్రీ మరిడి మహాలక్ష్మి అమ్మవారి పండుగ సందర్భంగా ఎడ్ల బండ్ల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను గౌరవ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు జెండా ఊపి ప్రారంభించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 11 మంది రైతులు పాల్గొన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేతుల మీదుగా వీరిలో 8 మందికి నగదు బహుమతులు అందించగా, మిగతా వారికి దారి ఖర్చులు అందజేశారు. మొత్తం మూడు రౌండ్లకుగాను 2 నిమిషాలు 12 సెకండ్ల వ్యవధిలో గమ్యం చేరిన కె.ఎల్.బి. పట్నం గ్రామానికి చెందిన బండారు చరణ్ హర్ష మొదటి బహుమతిగా రూ.15,000 గెలుచుకున్నారు. రెండో బహుమతిని లెక్కలవాని పాలెం గ్రామానికి చెందిన పైడితల్లమ్మ తల్లి 2 నిమిషాలు 13 సెకండ్లలో గమ్యం చేరి రూ.12,000 పొందారు. మూడవ బహుమతిగా అర్జున్ గిరి గ్రామానికి చెందిన పరవాడ నాయుడు 2 నిమిషాలు 14 సెకండ్లలో గమ్యం చేరి రూ.10,000 అందుకున్నారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, "గ్రామీణ ప్రాంతాలలో జరిగే సంప్రదాయ ఎడ్ల పందాలు మన సంస్కృతిని ప్రతిబింబిస్తాయన్నారు . ఈ రకమైన కార్యక్రమాల్లో పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉందని స్పీకర్ పేర్కొన్నారు.

# రెండో విడత ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** 29వ వార్డులో దీపం 2 పథకం లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసిన విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసన సభ్యులు ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్.

ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ-1 మురళీధర్,ఆర్. ఐ పద్మ,29వ వార్డు పరిశీలకులు దువ్వి గోవిందరావు, 29వ వార్డు జనసేన అధ్యక్షులు అంగటి శ్రావణ్,29వ వార్డు మాజీ కార్పొరేటర్ శ్రీమతి బుద్ధల అనురాధ,బి.జె.పి అధ్యక్షులు దేవాడ శేఖర్, తెలుగుదేశం నాయకురాలు నర్షయమ్మ, జనసేన నాయకులు మజ్జి అప్పలరాజు, కర్రి చిన్ని, లక్ష్మణ్, సాయి, సాయి వర్ధన్, రేషన్ డీలర్ సాయి,లబ్ధిదారులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీ బ్రాహ్మణి ముత్యాలమ్మ తల్లి పండగ మహోత్సవం



**పరవాడ, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రమైన పరవాడ లో శ్రీశ్రీశ్రీ బ్రాహ్మణి ముత్యాలమ్మతల్లి పండుగ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మీ శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ. అమ్మవారి చల్లని చూపు ఈ ప్రాంత ప్రజల పై ఎల్లప్పుడు ఉండాలని సుభిక్షంగా ఆనందంగా ఉండేలా చూడాలని అమ్మ వారిని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టి.డి.పి అధికార ప్రతినిధి పైల రామచంద్ర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు , వార్డు మెంబర్ పైల అప్పలనాయుడు సత్యవేణి,మాజీ ఆర్ఇసిఎస్ చైర్మన్ చల్ల కనకరావు, వర్రీ పైడం నాయుడు, సిరిపురపు అయ్యబాబు, వర్రీ హరి ,ఉత్సవ కమిటీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# మాస్ రీడింగ్‌లో పిల్లలకు అవగాహన




**నర్సీపట్నం టౌన్, (విశాఖ సమాచారమ్):-** స్థానిక శాఖా గ్రంథాలయంలో సమ్మర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ కొనసాగుతున్నది. గ్రంథాలయాధికారిణి దమయంతి పిల్లలచేత మాస్ రీడింగ్ చేయించారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే శారీరక వ్యాయామం ఎంతో అవసరమని రాష్ట్ర ఉత్తమ వ్యాయామ అవార్డు గ్రహీత ప్రభాకర్ అన్నారు. పిల్లలతో సులువైన వ్యాయామాలు చేయించారు. ప్రతిరోజు వ్యాయామం చేయుటవలన అనారోగ్యంనకు దూరంగా ఉండవచ్చని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు జరిపిన పరీక్షలో భాగంగా మొదటి, రెండవ, మూడవ బహుమతులతో పాటు 10 కాన్సలేషన్ బహుమతులను ప్రముఖ వ్యాపారవేత్త వెలగా నారాయణరావు దంపతులు అందించారు. గురువారం వెలగా. నారాయణరావు కోడలు(అమెరికా) జన్మదినం సందర్భంగా వేసవి శిక్షణా శిబిరం లో పాల్గొన్న చిన్నారుల మధ్య కేక్ కటింగ్ కార్యక్రమంను జరిపించి, నారాయణరావు దంపతులు చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సుతాపల్లి శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

# పాన్ షాప్ యజమానులు అప్రమత్తంగా ఉండాలి

## ఎస్సై రఘువర్మ



**రావికమతం, (విశాఖ సమాచారమ్):-** తరచూ పలు దుకాణాలలో చోరీలు జరుగుతున్న కారణంగా మండలంలో గ్రామాలకు దూరంగా ఉన్న పాన్ షాపులు యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై రావికమతం ఎస్సై రఘు వర్మ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రఘువరన్ మాట్లాడుతూ నేరాలు చోరీలు జరగకుండా ఉండేందుకుగాను పలు పాన్ షాప్ లో యజమానులకు మహిళలకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు.అలాగే సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వలన చోరీలను వెంటనే గుర్తించగా గుర్తించడానికి వీలవుతుందన్నారు కాబట్టి చేసే కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు ఇదిలా ఉండగా మండలంలో మేడివాడ గ్రామ సమీపంలో పలు వాహనాలను తనిఖీ చేయడం జరిగింది. వాహనాలపై ఇదివరకు విధించిన చలానాలు వసూలు చేయడం, అలాగే హెల్మెట్ లేనివారికి జరిమానా విధించడం జరిగిందని ఎస్సై తెలిపారు.

# ఉగ్రవాదులను నిర్మూలించాలి




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడం పట్ల జన జాగరణ సమితి సంతోషం వ్యక్తంచేసింది. బుధవారం ఉదయం బీచ్‌రోడ్డులోని విక్టరీ ఎట్ సీ వద్ద జాతీయ పతాకాలు పట్టుకుని తీవ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సమితి నగర కన్వీనర్ చింతపల్లి సునీల్ కుమార్ మాట్లాడుతూ పెహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్తాన్‌లో ఉగ్రవాద శిబిరాలను పూర్తిస్థాయిలో నాశనం చేయడంలో భారత్ సఫలీకృతం అయిందన్నారు. భారతీయులంతా కుల, మతాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి, భారత రక్షణదళాలకు సంపూర్ణ మద్దతు అందించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో జన జాగరణ సమితి నాయకులు వాసు, దామోదర్ గుప్తా, తనూజ్, మునివర్ధన్, జనార్దన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తీవ్రవాదానికి వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు.

2nd pages11.qxd 5/8/2025 7:39 PM Page 4



విశాఖ సమాచారమ్

శుక్రవారం 9-5-2025

# మోదీ విజయరహస్యం ఇదే!

ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా భారత ప్రధాని నరేంద్ర మోదీ యుద్ధ వ్యూహాలపైనే చర్చ నడుస్తోంది. ఎంత కఠినమైన సమయంలో కూడా తనలోని గాంభీర్యాన్ని ముఖంలో కనిపించనీయకుండా. పైకి తనపని తాను చేసుకుంటూ వ్యూహాలను సిద్ధం చేసుకుంటూ ఉండటమే ఆయన శ్కెలి. అవతలి వాడికి అవకాశమివ్వడం, అవతలివాడిని మాట్లాడనీయడం మోదీకి తెలిసిన మరో విద్య. అది చెడు కానంతవరకే భరిస్తారు.. ఒకవేళ అవతలి వాళ్ల నుంచి ప్రమాదం పొంచి ఉందన్న సమయంలో మాత్రం ఆయన వ్యవహారశ్కెలి భిన్నంగా ఉంటుంది. ప్రపంచ వ్యాప్తంగా విశేష అభిమానం సందపాదించుకున్న మోదీ యుద్ధ వ్యూహాలను చూసి ప్రపంచ మిలిటరీ వ్యూహకర్తలు, విశ్లేషకులు నివ్వెరపోతున్నారు. ఎడమవైపు సంజ్ఞ చేస్తారు కుడివైపుకు తిరుగుతారు.. ఇది మనకు ఆయన ప్రసంగంలో తరుచు కనిపిస్తూ ఉంటుంది. మరి ఆయన వ్యూహాలు కూడా ఇలానే ఉంటాయి. ప్రస్తుతం పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై దాడులే లక్ష్యంగా చేపట్టిన ఆపరేషన్ సింధూర్ కూడా ఇదే కోవలోకి వస్తుంది. పాకిస్తాన్ ఉగ్రస్థావరాలపై దాడులే కాకుండా ఆ దేశ కవ్వింపు చర్యలకు గట్టిగా బుద్ధి చెప్పాలనే ఉద్దేశంతో తలపెట్టిన ఆపరేషన్ సింధూర్ విజయవతమైంది. ఈ యుద్ధ తంత్రాలను పాకిస్తాన్ పసిగట్టలేకపోతోంది. బాలాకోట్, 'ఆపరేషన్ సింధూర్' రెండిరటికీ ముందు, ప్రధాని మోదీ బాడీ లాంగ్వేజ్ బహిరంగ ప్రదర్శనే గాక ఆయన ప్రసంగాలు కూడా ప్రశాంతంగా కనిపించాయి. ఆయన అసలు ఉద్దేశాన్ని బహిర్గత పరచలేదు. బాలాకోట్ దాడి వ్యూహం తరహాలోనే, ఈసారి కూడా ప్రధాని వ్యూహాలు పాకిస్తాన్‌ను నివ్వెరపరచాయ్. దాడికి ముందు ప్రశాంతమైన బాడీ లాంగ్వేజ్‌తో మాస్టర్‌మైండ్ యుద్ధతంత్రంతో. ఆపరేషన్ సింధూర్ కు ముందు ప్రదర్శించిన వైఖరి.. బాలకోట్‌కు ముందు ఆయన ప్రదర్శించిన వైఖరి పాకిస్తాన్‌ను అయోమయంలో పడేసింది. 2019లో బాలకోట్ దాడులకు ముందు ఆయన ప్రయాణ ప్రణాళికతో పాటు ఆయన ప్రసంగం, ప్రస్తుత 'ఆపరేషన్ సింధూర్' సందర్భంగా ఆయన వ్యూహాలు.. యుద్ధతంత్రంలో మాస్టర్‌క్లాస్‌లు.. శత్రువును అచేతనం చేసి.. మూగబోయేలా చేశాయి.

ఒకసారి చేస్తే యాదృచ్ఛికం కానీ మళ్ళీమళ్ళీ పునరావృతం చేయడమంటే.. ప్రపంచమనే వేదికను నివ్వెరపరచడమే. ఇది మోదీకే సాధ్యమైన యుద్ధతాండవం. అని నిస్సంకోచంగా చెప్పొచ్చు. రెండు దాడులకు మధ్య ఉన్న సారూప్యతలను పరిశీలిస్తే.. అవి కచ్చితంగా ఆశ్చర్యచకితుల్ని చేసే విధంగా ఉంటాయి. బాలాకోట్ దాడికి ముందు ఆయన ప్రదర్శించిన తంత్రం నుండి ఎలాంటి పాఠం నేర్చుకోనందుకు పాకిస్తాన్ తన చెప్పుతో తననే కొట్టుకుంటుంది. 2019 ఫిబ్రవరి 26న.. తెల్లవారుర%ఝ%మున భారతదేశం బాలకోట్ పై దాడి చేసింది. కానీ, ఆ దాడికి ముందు 48 గంటలు, మోదీ షెడ్యూల్ అంతా యథావిధిగా జరిగింది. ఫిబ్రవరి 25న, ఆయన న్యూఢల్లీలో జాతీయ యుద్ధ స్మారక చిహ్నాన్ని జాతికి అంకితం చేశారు. భారత సాయుధ దళాల పరాక్రమం గురించి మాట్లాడినప్పటికీ, పాకిస్తాన్ ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని జిహాదిస్ట్ మౌలిక సదుపాయాలపై రాబోయే దాడి గురించి ఎటువంటి సూచన ఇవ్వలేదు. ఈ నెల 6వ తేదీ రాత్రి 9 గంటలకు, భారత విమానాలు బయలుదేరడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, ప్రధాని మోదీ న్యూఢల్లీలో మీడియాతో మాట్లాడారు. భారతదేశం ఆకాంక్షలు, అభివృద్ధి, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా దాని సంకల్పం గురించి మోదీ మాట్లాడారు. ఆందోళన సూచించే ఒక్క ముడత కూడా అతని నుదిటిపై కనిపించలేదు. ప్రసంగంలో సందేహాస్పదమైన అంశాలకు ఏమాత్రం చోటివ్వలేదు. తుపాను ఎదురైనప్పుడు ప్రశాంతత, అగ్ని గుండంలోనూ ధైర్యంగా నిలబడగలగడం గొప్ప నాయకుడి లక్షణాలు అని మనస్తత్వవేత్తలు అంటారు. మోదీ నాయకత్వం.. వారు సూచించే నాయకత్వ అంచనాలకు సరిపోవడం చూసి.. వారు నాయకత్వానికి ఇచ్చిన భాష్యం సరైందేనని భావిస్తారు.

చరిత్ర నుండి పాఠాలు నేర్చుకోకపోతే, అవే తప్పులను పునరావృతం చేస్తారు. బాలాకోట్‌కు ముందు ప్రధాని మోదీ తీరును పాకిస్తాన్ విశ్లేషించి ఉంటే.. మే 6వ తేదీ రాత్రి నియంత్రణ రేఖ వెంబడి తొమ్మిది లక్ష్యాలపై భారత్ దాడి చేసినప్పుడు ఆ దేశం ఎంతో కొంత ప్రతిఘటించే ఉండేది. కానీ మోదీ వ్యూహాలు అర్థం కాకపోవడంతో పాకిస్తాన్ చూస్తూ ఉండిపోయింది. బాలకోట్‌కు ముందు ప్రధాని మోదీ వైఖరికి సంబంధించి కచ్చితత్వానికి ప్రతిరూపంగానే నిలుస్తుంది. దాడులకు కొన్ని గంటల ముందు, ఆయన ఒక మీడియా కార్యక్రమంలో పాల్గొని 2047 నాటికి భారతదేశం ఆర్థికంగా గొప్ప దేశంగా ఎదగాలనే ఆకాంక్షల గురించి మాట్లాడారు. 30 నిమిషాల పాటు జరిగిన ఆనాటి తన ప్రసంగంలో.. ఏమాత్రం ఆందోళన కానీ ఒత్తిడి లేని వ్యక్తిలా ప్రశాంతంగా ఆయన మాట్లాడారు, జోకులు వేస్తూ, భారతదేశంలో ఉగ్రవాద దాడులకు మద్దతు ఇచ్చినందుకు పొరుగువారిని విమర్శించడం వినడానికి ప్రేక్షకులు ఆసక్తిగా కనిపించినప్పటికీ, పాకిస్తాన్ అనే పదాన్ని మాత్రం ఒక్కసారి కూడా పలకలేదు. ఆ సందర్భంగా మోదీ బాడీ లాంగ్వేజ్‌ను పరిశీలిస్తే ఎలాంటి అంచనాకు రాలేం. యుద్ధ కళలో నిష్ణాతులు ఏమంటారంటే.. మీకు మీ శత్రువు గురించి పూర్తిగా తెలిస్తే, యుద్ధంలో ఓటమికి చాలా తక్కువ అవకాశం ఉంటుందని చెబుతారు. పాకిస్తాన్‌ను మోదీ పూర్తిగా చదివేశారు... కానీ ఆయన్ను అంచనా వేయడంలో పాక్ మళ్లీ ఫెయిల్ అయ్యింది. అందుకే గెలుపు ప్రతీసారి మోదీనే వరిస్తుంది.

# వినరో భాగ్యం విష్ణుకథ

## నేడు అన్నమయ్య జయంతి సందర్భంగా..

'చందమామరావో ..జాబిల్లిరావో' అని ప్రతి తల్లి తన బిడ్డలకు అన్నం పెట్టేటప్పుడు మారాం చేస్తే పాడుతూ చందమామను చూపిస్తుంది. ఎందరో తల్లులు తమ బిడ్డలకు బువ్వ తినిపించేటప్పుడు పాడే పాట ఇది. ఈ పాట వ్రాసింది పదకవితాపితామహుదు,

తొలివాగ్గేయకారుడు, సంకీర్తనాచార్యుడు తాళ్లపాక అన్నమాచార్యుడు. బిడ్డను నిద్రపుచ్చేటప్పుడు తల్లిపాడే లాలిపాట 'జో అచ్యుతానంద జోజో ముకుందా',ముద్దుగారే యశోద కొడుకు'వంటి పాటలు వ్రాసింది అన్నమయ్యే.

ఇప్పటికి 500 ఏళ్లుగా గోవిందుని సన్నిధిలో కీర్తించే కీర్తనలు అన్నమయ్య నోటినుంచి జాలువారినవే. 'నారాయణా నమో నమో భవ నారద సన్నుత నమోనమో',కొండల్లో నెలకొన్న కోనేరు రాయుడు',తిరుమల కొండ',వినరో భాగ్యం విష్ణుకథ' వంటి ఆణిముత్యాలు అన్నమాచార్యుడు వ్రాసినవే.

తెలుగుసంస్కృతిలోభాగమైన గొబ్బిళ్లు, తుమ్మెద, శృంగార, అధ్యాత్మిక కీర్తనలు అన్నమయ్య జాతికి ఇచ్చిన మణులు.జానపదుల నోట్లో అవి ఎల్లప్పుడూ నిలిచిఉంటాయి. ఆయన వేంకటేశునిపై అల్లిన శృంగార కీర్తనలు మనసుకు హాయినిస్తాయి.

ఆయన వ్రాసిన 32వేల కీర్తనలలో కేవలం 12వేలు మాత్రమే లభ్యమవుతున్నాయి. వాటిని ఆయన వారసులు తామ్రరేకులపై చెక్కారు. ప్రస్తుతం అవి తిరుమల శ్రీవారిభాండాగారంలో భద్రంగాఉంచారు.

అన్నమయ్య కీర్తనలను సాధారణ వాక్యాల్లో గేయాలుగా కూర్చారు.పదకవితాశైలికి, దక్షిణాదిభజన సంప్రదాయానికి ఆయన ఆద్యుడు. ఆయన తర్వాత వచ్చిన సంకీర్తనాకారులు త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసులకు అన్నమయ్య మార్గదర్శకుడు. తిరుమలలో ఆళ్వార్ ప్రబంధాలు అధ్యయనం చేసినా బ్రహ్మజ్ఞానం సాధించలేక పోయాననే బాధపడేవారు. భక్తుడైనఅన్నమయ్యకు గోవిందుడుకలలో కనిపించి గురుముఖతా విద్యాజ్ఞానం పొందమని సూచనలతో అహోబిలం ఆదివన్ శఠగోప ముని శిష్యరికం చేశారు. దాంతో ఆయనకు ఆత్మజ్ఞానం సిద్ధించింది.

వెంకటరమణుడితోపాటు నృసింహస్వామి భక్తుడు కూడా అన్నమయ్య. ఆయనపై అనేక కీర్తనలుపాడారు. ఆయన అనేక విష్ణుఆలయాలను సందర్శించి వారిపైకీర్తనలు రచించారు. ఆంజనేయుణ్ణి, రామానుజాచార్యులనూ కీర్తించాడు. భగవద్గీతను సులువైన పదాలతో మనోహరంగా మలచి గానంచేసారు.ఆయన నోటివెంట శృంగారం బంగారంలా పండింది. సంగీతసాహిత్యసమ్మేళితమే ఆయన కీర్తనలు. 95 సంవత్సరాలు నిండు జీవితం గడిపిన అన్నమయ్య తన చివరి క్షణం వరకూ పరంధాముని కీర్తించారు. ఉగ్గుపాలతో ఉదాత్తభావాలు వంట పట్టించుకున్న అన్నమయ్య హరిపాదానికి తనపదానికి ముడిపెట్టాడు. ఆయన తన గేయాల్లోతెలుగు ,సంస్కృత పదాలను సమానంగా వాడారు. సంకీర్త లక్షణమనే సంస్కృత గ్రంథం, మంజరిద్విపదలో శృంగారమంజరి, ద్విపదరామాయణం, వెంకటాచలమహత్యం రచించారు. కాని వీటిలో చాలా లభ్యం కావటం లేదు. .

అన్నమయ్య 1408 మే 9వతేదీ కడపజిల్లా రాజంపేట మండలం తాళ్లపాక గ్రామంలో (సర్వధార సంవత్సరంలో)జన్మించాడు. ఆ ఇంటి పురోహితుడు ఘన విష్ణువు అన్నమాచార్య అని నామకరణం చేసారు.ఏకసంథా గ్రాహి అయిన అన్నమయ్య ఇంటివద్దే విద్యను అభ్యసించారు. 16వ ఏట మొట్ట మొదట తిరుమల శ్రీనివాసుని దర్శించారు.ఆయన కీర్తనలతో స్వామిని సేవించడం ద్వారా పూజారుల అభిమానం పొందారు. మునుస్వామి అనే వ్యక్తి ఆశ్రయం ఇచ్చాడు.అక్కడ ఆళ్వారుల అధ్యాత్మిక గ్రంథాలను అధ్యయనం చేసారు. తల్లిదండ్రుల బలవంతంపై తిరిగి తాళ్లపాక చేరాడు. యుక్తవయస్సురాగానే తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నారు. భార్యలతో కలిసి రెండోసారి తిరుమల వెళ్లారు. అప్పటినుంచి రోజుకో కీర్తన శ్రీవేంకటేశ్వరునికి సమర్పించేవారు. అలా పుంఖానుపుంఖాలుగా కీర్తనలు చెప్పేవారు. శఠగోపముని శిష్యరికం



అనంతరం ఆయన సకల వైష్ణవ ఆగమనాలను అధ్యయనం చేసారు. కులగోడలను పగులగొట్టాలనేది ఆయన అభిమతం.

విజయనగరంలో దండనాధుడు సాళ్వ నరసింహరాయలు అన్నమయ్య పదాలను చూసి ఆదరించారు. అనంతరకాలంలో పెనుకొండ ప్రభువు కాగానే అన్నమయ్యను ఆహ్వానించారు. ఆయన ఆస్థానంలో తగిన గౌరవం ఇచ్చారు.తనపై కీర్తనలను రాయమని అడిగాడు.'హరిని కీర్తించే నోట నరుని కీర్తించను' అని తిరస్కరించారు. దాంతో అన్నమయ్య ను ఖైదుచేసాడు పెనుకొండ ప్రభువు. ఆ తర్వాత రాజాస్థానం తనకు తగినది కాదని అక్కడ నుంచి తిరుమల చేరి జీవితశేషం వరకూ స్వామి సేవలో గడిపాడు.

పంచమాగమసార్వభౌముడు,ద్రవిడాగమ సార్వభౌముడు బిరుదాంకితుడైన అన్నమయ్య జీవితవిశేషాలు ఆయన మనవడుచిన్నన్న గ్రంథం వల్ల వెల్లడైనాయి. చిన్నన్నరచించిన ద్విపద కావ్యం అన్నమాచార్య చరిత్ర 1948లో ముద్రణ కావడంతో ఆయన వివరాలు ప్రపంచానికి తెలిసింది. ఆ రచనే మూలాధారం.అన్నమయ్య కీర్తనల కంటే ముందు కృష్ణమాచార్యుల,శివకవుల కీర్తనలు ఉన్నా అన్నమాచార్య కీర్తనలతో అవి మరుగున పడిపోయాయి. ఆయన నోటి నుంచి కీర్తనలు వచ్చినవి శిష్యులు వాటిని తాళపత్రగ్రంథస్తం చేసారు.

10వ శతాబ్దంలో కాశీలో తీవ్ర కరువు ఏర్పడడంతో అన్నమయ్య పూర్వీకులు దక్షిణాదిన నందవరం గ్రామానికి వలస వచ్చారు.అందుకే వారిని నందవరీకులంటారు.ఆ తర్వాత వారి వంశీయులు తాళ్లపాకలో స్థిరపడ్డారు.అన్నమయ్య తాత నారాయణయ్యకు చిన్నతనంలో చదువు అబ్బలేదు.గురువు నిందించడంతో చనిపోవాలని చింతలమ్మ గుడిపక్కన ఉన్న పుట్టలో చేయి పెట్టాడు.రాత్రిపూట గ్రామదేవత చింతలమ్మ ఊరు పొలిమేరలో సంచరిస్తుందని గ్రామస్తుల నమ్మకం. ఆరోజు నారాయణయ్య పుట్టలో చేయి పెట్టడంతో చింతలమ్మ వచ్చి వారించిందని వారి వంశీకుల ఉవాచ. అప్పుడు ఆమె మీ మూడోతరంలో హరిఅంశతో కుమారుడు పుడతాడని చెప్పింది. అన్నమయ్య తండ్రి నారాయణ సూరి మహా పండితుడు.తల్లి లక్కమాంబ సంగీత విద్వాంసురాలు. వారు బిడ్డల కోసం తిరుమల వెళ్లి శ్రీనివాసుని అర్చించారు. ధ్వజస్తంభం ముందు సాష్టాంగ నమస్కారం పెడుతున్నప్పుడు స్వామివారి నుంచి దివ్యవెలుగు లక్కమాంబ కడుపులో ప్రవేశించిందని చెబుతారు. స్వామివారి ఖడ్గం నందకమే అన్నమయ్య గా జన్మిచాడని భాగవతులు చెబుతారు.ఆయన భార్య తిమ్మక్క తొలి మహిళా కవయిత్రి. సుభద్రా పరిణయం రచించారు. అన్నమయ్య కుమారుడు పెద తిరుమలాచార్యుడికి తాను దేహం చాలించిన తర్వాత ప్రతిరోజూ స్వామివారిని కీర్తించే బాధ్యత అప్పగించాడు. అన్నమయ్య సమాధి తిరుపతిలో ఉంది.

కలియగ దైవం శ్రీవేంకటేశ్వరుని భక్తాగ్రేశ్వరుడు అన్నమయ్య 1503 ఫిబ్రవరి 23 (దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ ద్వాదశి)న శ్రీనివాసునిలో ఐక్యమైనారు. 5 శతాబ్దాలు దాటినా ఆయన కీర్తనలు ఇప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా రసరమ్యంగా ప్రజల నాలుకలపై నాట్యం చేస్తున్నాయి. శ్రీనివాసుని వైభవం ఉన్నంతవరకూ అన్నమయ్య కీర్తనలు అజరామరం.



ఎం.వి.రామారావు,
సీనియర్ జర్నలిస్ట్
సెల్: 918074129668

# జయహో సింధూరం..!

ఉగ్రం వీరం మహావీరం..
శత్రు భయంకరం..
మహా భీకరం..
తెరుచుకుంది
మన ఆయుధ భాండాగారం..
పేలింది తొలి శత్రు గుడారం..
భరతమాత నుదుటిన
వీర సింధూరం..!

దాయాది కొంప మృత్యుకుహరం..
తల్లి భారతి మెడలో
విజయాల సమాహారం..
ఇక ఉగ్రవాదం క్షణభంగురం..
సుందర కాశ్మీరంలో
శాశ్వతంగా శాంతి సమీరం..
ప్రతి తల్లి ఫాలభాగంలో
ఐదోతనపు మహా సింధూరం..!

పొరుగున ఎన్నాళ్లీ టెంపరం..
మన దేశం ఎంత శాంతికాముకమైనా
ఒకనాటికి పుట్టదా కంపరం..
ఇక సాగేది లేదంటూ కలహాల కాపురం..
పెహల్గాన్ ఉగ్రదాడి ఆలంబనగా ప్రతీకారం..
ఉడుకెత్తింది తరం తరం..
కదనరంగంలోకి
ఉరికింది భారత యువతరం..
ఆపడం ఎవరి తరం..
అటు రక్త సాగరం..
ఇటు ఎగిరింది తెల్ల పావురం..
తీరింది మగువ ప్రతీకారం..
మురిసింది ప్రతి ఇంటి వాకిట
విజయ సింధూరం..!

దొంగదాడులకు..
నిర్దాక్షిణ్య ప్రవర్తనకు..
దాయాది నిరంతర
ఉగ్రవాద చెలిమికి..
అమానుష హత్యాకాండకు..
ఆగక సాగుతున్న
మారణహోమానికి..
చరమగీతం..
పాకిస్తాన్ దేశమే ఇక అయిపోవాలి చరిత్రలో
ఒక గతం.. ఇదే దీక్షతో చేపట్టిన
ఆపరేషన్ సింధూరం
విజయవంతం కావాలనే ఆకాంక్షతో..

ఎలిశెట్టి సురేష్ కుమార్, విజయనగరం
9948546286




# అంతరంగ సాక్షి



ఓ పెద్దమనిషికి అమెరికాలో జరిగిన అనుభవమిది.

సర్ ఎం. విశ్వేశ్వరయ్య.

ఆయన ఓసారి అమెరికాకు వెళ్ళారు. చికాగో నగరంలో ఓ హొటల్లో బస చేశారు.

ఇంకొన్ని గంటల్లో ఆయన భారతదేశానికి బయలుదేరాల్సిన సమయంలో జరిగిన సంఘటన ఇది.

ప్రయాణానికి ఓ మూడు రోజుల ముందు ఆయనకు ఓ వస్తువు కావలసి వచ్చింది.

ఏదైనా దుకాణంలో ఆ వస్తువుకి ఆర్డరు ఇచ్చి ఆ తర్వాత కొనుక్కోవాలనుకున్న ఆయన చికాగో నగరంలో ప్రత్యేకించి ఓ దుకాణానికి వెళ్ళారు.

తనకు ఎలాంటి వస్తువు కావాలో వివరించి అలాంటిది చేసివ్వమని చెప్పారు విశ్వేశ్వరయ్య.

ఓ...తప్పకుండా అన్నారు ఆ దుకాణదారు.

మీకెప్పుడు కావాలో తేదీ చెప్పి ఆ రోజు సాయంత్రం వచ్చి తీసుకువెళ్ళవచ్చు అన్నారు.

ఆయన చెప్పిన తేదీకి మరుసటి రోజే ఆయన స్వదేశానికి బయలుదేరవలసి వుంది. ఆ వివరాలనూ ఆయన దుకాణదారుకి చెప్పారు. ఆ వస్తువు ధర ఎనిమిది డాలర్లు అని దుకాణదారు చెప్పారు.

మీరు చేసిచ్చిన వస్తువు నాకు తృప్తిగా ఉండి దానిని నేను చెప్పిన సమయానికి ఇస్తే కనుక మీరు చెప్పిన ధరకన్నా మరో డాలర్ ఎక్కువ ఇస్తానని వచ్చేశారు విశ్వేశ్వరయ్య.

దుకాణదారు చెప్పిన నిర్ణీత సమయానికి విశ్వేశ్వరయ్య ఆ దుకాణానికి వెళ్ళారు.

ఆయన వెళ్ళిన సమయానికి ఆ దుకాణదారు దుకాణంలో లేరు. ఎక్కడికో పని మీద ఆయన బయటకు వెళ్లారు. అయినా అప్పటికే ఆయన అడిగిన వస్తువు అక్కడ సిద్ధంగా ఉంది.

దుకాణంలో ఉన్న సిబ్బంది ఒకరు ఆ వస్తువు ఆయనకు ఇచ్చారు. దాన్నందుకున్న విశ్వేశ్వరయ్య నిశితంగా చూశారు. మలసుకి తృప్తిగా ఉంది. వంటనే ఆ దుకాణ సిబ్బందికి ఆయన ఎనిమిది డాలర్లు ఇచ్చారు. అనంతరం తాను అదనంగా ఇస్తానన్న మరొక్క డాలరు కూడా అతనికి ఇచ్చారు. ఎందుకంటే తానను ముందిచ్చిన మాటకు కట్టుబడి లేనన్న మాట రాకూడదని ఇచ్చేసారు ఆయన.

ఈయన ఆ వస్తువు తీసుకుని తిరిగొచ్చేశారు.

అనంతరం దుకాణదారు, విశ్వశ్వరయ్య ఎక్కడైతే ఉన్నారో అక్కడికి వచ్చారు.

విశ్వేశ్వరయ్యకు ఆశ్చర్యం.

ఏమిటి సంగతి అని అడిగారు.

అయ్యా, మా దుకాణంలో మీరు అదనంగా ఓ డాలరు ఇచ్చారు. మీ చిరునామా ఇవ్వకుండా వెళ్లిపోయారు. దాంతో అనేక చోట వెతికి చివరికెట్లాగో ఈ చిరునామా తెలుసుకన్నామన్నారు దుకాణదారు.

ఎందుకంటి అంత శ్రమపడ్డారు...సాధారణంగా అందరు వ్యాపారులు తీసుకున్నట్టే ఈ ఒక డాలరు తీసుకోకూడదు. మీరు తీసుకోవడానికి వెనుకాడినా నేను మీకు ఆర్డర్ ఇచ్చిన మాటకు కట్టుబడే ఇచ్చానండి ఆ అదనపు డాలరు. అంతకన్నా ఇంకేం కాదు అన్నారు విశ్వేశ్వరయ్య.

అలాకాదండీ....ఆ డబ్బు నేను సంపాదించలేదు. అందుకే నాకా డబ్బు మీద హక్కు లేదు అన్నారు దుకాణదారు. మీరు అడిగిన వస్తువు ఇవ్వడమే మా వంతు. దానికెంత ధరో ఆ మేరకే మేము తీసుకుంటాం. అంతేతప్ప అదనంగా తీసుకోవడం సరికాదని చెప్పారు.

ఇది అంతరంగానికి సంబంధించిన విషయం.

ఇటువంటి మనస్తత్వం ఈరోజుల్లో ఎందరిలో ఉంది.

ఆలోచిస్తే సరైన జవాబు దొరకుతుందా అన్నది అనుమానమే.

ఒకరు విమానం నడపడం నేర్చుకోవాలనుకున్నారు. శిక్షణ కూడా పొందారు.

మొదటి రోజు విమానం నడపడానికి వెళ్ళారు. దాని కన్నా ముందర ఆయన ఓ ప్యారాచుట్ కొనాలనుకున్నారు.

నింగిలో ఏదన్నా జరగరానిది జరిగితే ఈ ప్యారాచుట్ సాయంతో కిందకు సురక్షితంగా చేరుకోవచ్చున్నది ఆయన ఆలోచన.కనుక ఆయన ప్యారాచుట్ కొనడం కోసం ఓ దుకాణానికి వెళ్ళారు.

మంచి ప్యారాచుట్ చూపండి అన్నారు.

అక్కడి సిబ్బంది చూపించారు. దాన్ని అటూ ఇటూ చూశారు. ఆ తర్వాత దుకాణదారుని చూసి సార్ ఇది కొనుక్కుతీసుకుపోతాను...మంచిది ఇవ్వండి. ఎందుకంటే ఒకవేళ నేను గాల్లో పోతున్నప్పుడు దూకడానికి ప్రయత్నించినప్పుడు నాకు ప్రమాదం జరగొచ్చు కదా అన్నారు.

అప్పుడా దుకాణదారు చెప్పారు ...

సార్, దీని గురించి మీరు పవ్వంత కూడా అనుమానించక్కర్లేదు. మీరు ఎత్తులోంచి దూకుతున్నప్పుడు ఈ ప్యారాచుట్ సరిగ్గా పని చేయకుంటే అప్పుడు మీరు దీనిని తిరిగిస్తే మీకు కొత్తది ఇంకొకటి ఇస్తాం అన్నారు.

- యామిజాల జగదీశ్

# చరిత్రలో ఈ రోజు (మే 9)

**సంఘటనలు:**

1994: దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా నెల్సన్ మండేలా ఎన్నిక

జననాలు:

1540 : మేవార్ రాజపుత్ర రాజు రాణాప్రతాప్

1866: గోపాలకృష్ణ గోఖలే, స్వాతంత్ర్య సమర యోధుడు

1933: దోమాడ చిట్టబ్బాయి, నాదస్వర విద్వాంసులు.

1955: టీ.రాజేందర్ , తమిళ నటుడు,దర్శకుడు

1989: విజయ్ దేవరకొండ, తెలుగు సినిమా నటుడు.

1992: సాయి పల్లవి, భారతీయ సినిమా నటి.

మరణాలు:

1850 : ఫ్రెంచి భౌతిక రసాయన శాస్త్రవేత్త జోసెఫ్ లూయిస్ గే-లూసాక్ మరణం.

1970: కొమ్మూరి పద్మావతీదేవి, తెలుగులో తొలితరం రంగస్థల నటి, కథా రచయిత్రి.

1981: దుర్గాబాయి దేశ్‌ముఖ్, స్వాతంత్ర్య సమర యోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి.

1986: టెన్సింగ్ నార్కే, ఎవరెస్టు పర్వతం ఎక్కిన మొదటి విజేత.

2003: క్రాంతి కుమార్, నిర్మాత,దర్శకుడు,

2023: మోహన్ మహర్షి, నాటక దర్శకుడు, నటుడు, నాటక రచయిత

జాతీయ దినోత్సవోలు:

శంకర జయంతి

మాతృ దినోత్సవం

## పంచాంగం

శుక్రవారం 9-5-2025

శ్రీ విశ్వావసు నామ సంవత్సరము

ఉత్తరాణాయణం, వసంత రుతువు

వైశాఖ మాసం

| | |
|---|---|
| తిథి | : శు. ద్వాదశి ప. 2.57 |
| నక్షత్రం | : హస్త రా. 12.09 |
| వర్జ్యం | : ఉ. 6.34 ల 8.22 |

2nd pages11.qxd 5/8/2025 7:39 PM Page 5



## ఆహారకల్తీ.. రెండో స్థానంలో తెలంగాణ.. నాలుగో స్థానంలో ఆంధ్రప్రదేశ్



ఆహార కల్తీలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రెండో స్థానంలో నిలిచింది. ఆహార భద్రత అధికారులు గత నాలుగేళ్లలో దేశవ్యాప్తంగా సేకరించిన ఆహార నమూనాల్లో సగటున 22 శాతం కల్తీవే ఉండటం గమనార్హం. 2021-24 మధ్య దేశవ్యాప్తంగా సేకరించిన ఆహార పదార్థాల నమూనాలు, అందులో కల్తీవిగా తేలిన నమూనాల వివరాలను కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ రాష్ట్రాల వారీగా ఇటీవల పార్లమెంటుకు నివేదించింది.

ఈ లెక్కల ప్రకారం ఆహార కల్తీలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ రెండోస్థానంలో నిలిచింది. తెలంగాణలో సేకరించి పరీక్షించిన ప్రతి 100 నమూనాల్లో 14 కల్తీ ఆహారంగా తేలుతున్నాయి. తమిళనాడు 20 శాతం సగటుతో దక్షిణాది రాష్ట్రాల్లో అగ్రస్థానంలో ఉంది. కేరళ 13.11 శాతం, ఆంధ్రప్రదేశ్ 9 శాతం, కర్ణాటక 6.30 శాతంతో వరుసగా తర్వాతి స్థానాల్లో నిలిచాయి.

## కలెక్టరేట్‌లో రక్తదాన శిబిరం




**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** గురువారం ప్రపంచ రెడ్ క్రాస్, తలస్సమియా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఆఫీస్ నందు మెగా రక్తదాన శిబిరం నిర్వహించడం జరిగింది.

దీనికి ముఖ్య అతిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ శ్రీ ఎమ్ ఎన్. హరేంద్ర ప్రసాద్ గారి చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసారు.

ఈ కార్యక్రమం లో జిల్లా రెవిన్యూ అధికారి శ్రీ బి ఎచ్ భవాని శంకర్ గారు విచ్చేశారు. కలెక్టర్ గారు తన ఉపన్యాసంలో యువతి యువకులను రక్తదానానికి ముందుకు రావాలని, రక్త దానమంటే ప్రాణదానమని,ముఖ్యంగా వేసవిలో రక్త నిల్వలు తగ్గటం వలన రోగులు చాలా ఇబ్బంది పడతారు. మన బాధ్యతగా మన వంతు సహాయం మనం చేయాలి అని పిలుపునిచ్చారు.

కలెక్టర్ గారు మరియు డిఆర్ఓ రక్త దానమిచ్చి అందరిని ప్రోత్సాహించారు.

ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సెక్రటరీ పి. రవికుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మి, జూనియర్ రెడ్ క్రాస్ యూత్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ ఎం డి రెహంతుళ్ళ, జిల్లా కోఆర్డినేటర్ సంతోష్, హొమ్ లెస్ షెల్టర్ మేనేజర్ మురళి పాల్గొన్నారు.

## జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

### జాబ్ మేళా గోడపత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):–** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ పార్వతీపురం మన్యం జిల్లా వారి ఆధ్వర్యంలో ఈ నేల 9 వ తేదీన బైపాస్ రోడ్ లో గల భాస్కర్ డిగ్రీ కళాశాలలో జరగబోయే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ జాబ్ మేళాలో 10 బహుళ సంస్థల ప్రతినిధులు పాల్గొని అర్హులను ఎంపిక చేస్తారన్నారు. 10వ తరగతి నుండి పీ.జీ వరకు చదివిన యువతి యువకులు ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి అర్హతను బట్టి రూ.10,000/– నుండి 20,000/– వరకు వేతనం లభిస్తుంది అన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గొట్టాపు వెంకట నాయుడు, రౌతు వేణుగోపాలనాయుడు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డేవిడ్ వార్నర్ నటించిన రాబిన్హుడ్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్, సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు ప్రారంభం!

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** తెలుగు ప్రేక్షకులకు ఇరవై నాలుగు గంటలు నాన్‌స్టాప్ వినోదంఅందించే జీ తెలుగు ఈ వారం మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలతో అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను ఆకట్టుకున్న సూపర్ హిట్ సినిమా 'రాబిన్హుడ్'ను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా అందిస్తోంది. చిన్నపిల్లల్లోని నటనా ప్రతిభనువెలికితీస్తూ అశేష ప్రేక్షకాదరణతో కొనసాగుతున్న డ్రామా జూనియర్స్ 8 ఈ వారంమాతృదినోత్సవం ప్రత్యేక ఎపిసోడ్తో అలరించేందుకు సిద్ధమైంది. ప్రారంభం నుంచీ జీతెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న జీ తెలుగు సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ ఈవారం ఫినాలేకి చేరుకుంది. అంతేకాదు కుటుంబ కథతో పవన్ సాయి, అక్షిత, భావన ప్రధానపాత్రల్లో తెరకెక్కుతున్న సరికొత్త సీరియల్ ఘరానా మొగుడు ప్రారంభంకానుంది. యాక్షన్ఎంటర్టైనర్ రాబిన్హుడ్ ఈ శనివారం సాయంత్రం 6 గంటలకు, డ్రామా జూనియర్స్ 8 మాతృదినోత్సవ ప్రత్యేక ఎపిసోడ్ రాత్రి 9 గంటలకు, సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ గ్రాండ్ ఫినాలే ఆదివారం రాత్రి 9గంటలకు,




సరికొత్త ధారావాహిక ఘరానా మొగుడు మే 12న ప్రారంభం,సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు, మీ జీ తెలుగులో!

నితిన్, దేవదత్త నాగే, శ్రీలీల, వెంకీ కుడుముల దర్శకత్వంలో,నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించిన ఈసినిమాలో నితిన్, శ్రీలీల, దేవదత్త నాగే,సిజ్జు, డేవిడ్ వార్నర్ ముఖ్యపాత్రలు పోషించారు. జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించినఈ యాక్షన్ ఎంటర్టైనర్ని మీరూ తప్పకుండా చూసేయండి.

వారం వారం వినోదభరితమైన స్కిట్స్తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న డ్రామా జూనియర్స్ 8 ఈ వారం మరో ప్రత్యేక ఎపిసోడ్తో వచ్చేస్తుంది.మాతృదినోత్సవం సందర్భంగా అనిల్ రావిపూడి తల్లి ఈ షోలో పాల్గొననున్నారు. మరి మీరూఈ ఎపిసోడ్ని మిస్ కాకుండా చూడండి. ఇక, ప్రతి శనివారం ఆటపాటలతో ప్రేక్షకులకు వినోదం పంచుతున్న జీతెలుగు సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ గ్రాండ్ ఫినాలేకు చేరకుంది. ఇక ఈఎపిసోడ్లో రోజా, మంచు లక్ష్మి పాల్గొని మరింత వినోదం పంచారు.

అంతేకాదు! జీ తెలుగు మే 12న మరో కొత్త ధారావాహిక ఘరానామొగుడు ప్రారంభిస్తోంది. ఈ సీరియల్ కుటుంబం, ప్రేమ ముఖ్య నేపథ్యాలుగా తెరకెక్కుతోంది. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు మధ్యాహ్నం 3 గంటలకు జీతెలుగులో ప్రసారమయ్యే ఘరానా మొగుడు సీరియల్ మిస్కాకుండా చూడండి!, ప్రతిభావంతులైన నటీనటులు, ఆకట్టుకునే కథతో ఘరానా మొగుడు సీరియల్ జీ తెలుగువీక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. పవన్ సాయి, అక్షిత ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా,భావన, తేజల్, శరత్ చంద్ర, సుచిత్ర కీలక పాత్రల్లోకనిపించనున్నారు.

## ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రాము నాయుడు




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** జిల్లాలో మూతపడ్డ షుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని, రైతులకు, కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో గల పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఈనెల 5,6 తేదీలలో ఎలమంచిలిలో జరిగిన జిల్లా రెండవ మహాసభలో పలు తీర్మానాలు చేశామని అన్నారు. తాండవ, శారద జలాల పరిరక్షణ, స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకునే ప్రయత్నాలు, అటవీ బంజర భూములు, ప్రభుత్వ భూములలో గిరిజనులకు పట్టాలు, సాగు చేస్తున్న గిరిజనేతరులకు సాగు పట్టాలు ఇప్పించే విధంగా ఉద్యమాలు చేయడానికి తీర్మానాలు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఎన్నికల ముందు అధికారం కోసం కూటమి నాయకుడు ఇచ్చిన హామీలు అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి వంటి కార్యక్రమాలు చేయడానికి తీర్మానించినట్లు రాము నాయుడు తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన, చెందుతున్న ఈ జిల్లాలో కాలుష్య రహిత పరిశ్రమలకు, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో ఎస్ ఈ జెడ్, పరవాడలో ఫార్మా , నక్కపల్లిలో ఇండస్ట్రియల్ కారిడార్ వంటి పరిస్థితులలో

స్థానికులు ఉద్యోగాలు ఇవ్వకుండా మొండి చేయి చూపించారని అన్నారు. ఆ కాలుష్య పరిశ్రమ ద్వారా వచ్చే కాలుష్యంతో ప్రజలు చనిపోవడమే కాకుండా, అనారోగ్యం పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడలో ప్రజలు తిరస్కరించిన డ్రగ్స్ పరిశ్రమము జిల్లాలో ఏర్పాటు చేస్తూ మా గొప్పతనమే అంటూ ఇక్కడి ప్రజాప్రతినిధులు గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జి .గురు బాబు, అనకాపల్లి మండల కార్యదర్శి వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌టిపిసిలో సివిల్ మాక్ డ్రిల్..

### అత్యవసర సమయాల్లో స్పందన పై అవగాహన



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):–** అత్యవసర సమయాల్లో కార్మికులు, పౌరులు ఎలా స్పందించాలనే దానిపై అవగాహన కల్పించి, వారిని సమాయత్తపరిచేందుకు దేశవ్యాప్తంగా సివిల్ మాక్ డ్రిల్ నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం ఎన్టిపిసి పరవాడ నందు సివిల్ మార్క్ డ్రిల్ నిర్వహించారు.ఈ డ్రిల్‌లో భాగంగా ఎన్టీపీసీ పరవాడ సంకల్ప్ భవన్ నందు సాయంత్రం 4 గంటలకు ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్టిపిసి జనరల్ మేనేజర్ ప్రశాంత్ కుమార్ జన మాట్లాడుతూ కేంద్ర హొం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు పరిశ్రమలలో ఈ సివిల్ మార్క్ డ్రిల్ నిర్వహించడం జరిగిందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కార్మికులంతా అప్రమత్తతో ఉండాలని, అధికారులు సూచనల మేరకు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.పోలీసు శాఖ సంబంధించి అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, రెవెన్యూ శాఖకు సంబంధించి రెవెన్యూ డివిజన్ అధికారి షేక్ ఆయిషా, వైద్య శాఖ అధికారి శాంతి ప్రభ మాట్లాడుతూ వారి శాఖలకు సంబంధించి పూర్తి సహకారం అందిస్తామని, అత్యవసర సమయంలో సమన్వయంతో పనిచేసి ప్రాణ ఆస్తి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.సింహాద్రి ఎన్టీపీసీ సి.ఐ.ఎస్.ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్ సింగ్, అసిస్టెంట్ కమాండ్ రాజ్ కుమార్, జి డి.ఇన్స్పెక్టర్ అప్పలస్వామి, ఫైర్ ఇన్స్పెక్టర్ శుభంకర్ సర్కార్, రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా యుద్ధ వాతావరణం క్రియేట్ చేసారు. సైరన్ మోతలు, కరెంటు నిలిపివేత, పౌరుల తరలింపు, యుద్ధం జరిగితే ఎలా తమను తాము రక్షించుకోవాలనే విషయంపై కార్మికులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కసరత్తులో భాగంగా సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించారు. వైమానిక దాడి హెచ్చరిక సైరన్ మోగినప్పుడు ఎలా స్పందించాలి, విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు (బ్లాక్ అవుట్) తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్స కోసం ఉంచుకోవాల్సిన అత్యవసర వస్తువులు, మందుల గురించి వివరించారు.శత్రుదాడుల సమయంలో పౌరులు, విద్యార్థులకు స్వీయ రక్షణలో శిక్షణ ఇవ్వడం, క్రాష్ బ్లాక్ అవుట్ చర్యలను అమలు చేయడం, కీలకమైన మౌలిక సదుపాయాలను ముందస్తుగా లభ్యపెట్టడం, యుద్ధ సమయంలో సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లే ప్రణాళికలను నవీకరించడం, రిహార్సల్ చేయడం ఈ డ్రిల్ యొక్క ముఖ్య ఉద్దేశాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏజీఎం సేఫ్టీ తుషార్ (ఎన్టిపిసి),అడిషనల్ ఎస్పీ దేవప్రసాద్, మోహన్ రావు, డీఎస్పీ పరవాడ విష్ణు స్వరూప్, ఇన్స్పెక్టర్ పరవాడ మల్లికార్జునరావు, రెవిన్యూ డివిజనల్ అధికారి అయేషా, జిల్లా వైద్య శాఖ అధికారి శాంతి ప్రభ, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వెంకటరమణ, సిఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్ సింగ్, అసిస్టెంట్ కమాండెంట్ రాజ్ కుమార్, ఇన్స్పెక్టర్స్ అప్పలస్వామి, సుభాన్కర్ సర్కార్, రాజేష్ కుమార్. ఎన్టిపిసి సిబ్బంది, సిఐఎస్ఎఫ్ సిబ్బంది, పోలీస్ శాఖ స్వాట్ టీం పాల్గొన్నారు.

## విద్య, ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

## డి.ఎస్సీ- కరంట్ అఫైర్స్

1. భారత పునర్వినియోగ ఇంధనాల అభివృద్ధి ఏజెన్సీ (ఐ ఆర్ ఈ డి ఏ) లిమిటెడ్ ఒక విదేశంలో 900 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టును 290 కోట్ల రూపాయల పెట్టుబడులతో ఏర్పాటు చేయనున్నట్లు 2024 జూలైలో ప్రకటించింది. అది ఏ దేశం?
   జ :నేపాల్
2. 2023-24 సంవత్సరానికి అఖిల భారత ఫుట్ బాల్ ఫెడరేషన్ అందించే అత్యుత్తమ ఫుట్ బాల్ క్రీడాకారుడిగా 2024 జూలైలో గుర్తింపు పొందిన వ్యక్తి ఎవరు?
   జ :. లాలి యంజువాలా చాంగ్టే
3. అపోలో–11 మిషన్ ద్వారా చంద్రుడి మీద మొట్టమొదటి సారిగా మానవులు దిగిన తేదీకి గుర్తింపుగా ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా 'అంతర్జాతీయ చంద్రుడి దినోత్సవం'గా ఐక్యరాజ్యసమితి ఒక దినోత్సవాన్ని ప్రకటించింది. అది ఏ రోజు?
   జ : జూలై 20
4. గణిత శాస్త్రంలోని 'పై' (%లా%) ప్రాధాన్యతను గుర్తించి గౌరవించేందుకు గాను ప్రపంచ వ్యాప్తంగా ప్రతి ఏటా 'పై' ఎప్రాక్సిమేషన్ డే లేదా క్యాజువల్ 'పై' డే తో పేరుతో ఒక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అది ఏ రోజు?
   జ : జూలై 22
5. భారత్ లో దేశవ్యాప్తంగా ప్రతి ఏటా జాతీయ జెండా గుర్తింపు దినోత్సవాన్ని జరుపుకుంటారు. అది ఏ రోజు?
   జ : జూలై 22
6. 'ఇండియా మొబైల్ కాంగ్రెస్' సదస్సు ఎనిమిదవ విడత 'భవిష్యత్తు ఇప్పుడే' (ఫ్యూచర్ ఈజ్ నౌ) అనే నినాదంతో 2024 అక్టోబర్ 15 -18 తేదీల మధ్య మన దేశంలోని ఏ ప్రాంతంలో జరిగింది?
   జ: ఢిల్లీ
7. దక్షిణార్థ గోళంలోని దేశాలకు కొత్త ఆవిష్కరణలు, కొత్త వాణిజ్యాలు, మేధోసంపత్తికి సంబంధించిన కార్యక్రమాలను అభివృద్ధి చేయడానికి ప్రపంచ మేధో సంపత్తి సంస్థతో ఒక ఉమ్మడి పత్రంపై 2024 జులైలో సంతకం చేసిన సంస్థ ఏది?
   జ. అటల్ ఆవిష్కరణల మిషన్
8. వరల్డ్ అట్లాస్ డాట్ కామ్ 2024 జులైలో విడుదల చేసిన ప్రపంచంలోని మొట్టమొదటి పది అతి పెద్ద బొగ్గు క్షేత్రాల జాబితాలో బొగ్గు ఉత్పత్తి పరిమాణానికి సంబంధించి ప్రపంచంలో రెండవ, నాలుగవ ర్యాంకులను మన దేశంలోని 'ఆగ్నేయ బొగ్గు క్షేత్రాల లిమిటెడ్ సంస్థ' ఆధ్వర్యంలోని గేవ్రా బొగ్గు క్షేత్రం, కూస్మండా బొగ్గు క్షేత్రం పొందాయి. ఇవి ఏ రాష్ట్రంలో ఉన్నాయి ?
   జ : ఛత్తీస్ ఘడ్
9. 2024వ సంవత్సరానికి అంతర్జాతీయ 'మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్' ర్యాంకులలో మొట్టమొదటి 100 అంతర్జాతీయ కంపెనీలలో 6వ స్థానాన్ని పొందిన మన దేశానికి చెందిన బీమా కంపెనీ ఏది?
   జ. టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్
10. విశ్వంలో ఆవిష్కరణల అంశంలో గణనీయమైన కృషి జరిపినందుకు గాను ప్రతిష్టాత్మక ప్రపంచ అంతరిక్ష అవార్డును 2024వ సంవత్సరానికి మన దేశానికి చెందిన చంద్రయాన్–3 మిషన్ బృందం గెలుచుకుంది. దీన్ని ఏ సంస్థ అందజేస్తుంది?
    జ. అంతర్జాతీయ ఖగోళ శాస్త్ర సమాఖ్య
11. ఎస్తోనియా దేశానికి కొత్త ప్రధాన మంత్రిగా 2024 జులైలో నియమితులైన వ్యక్తి ఎవరు?
    జ. క్రిస్టెన్ మిఖాల్
12. విశ్వంలోని గ్రహాల రక్షణ కోసం గ్రహ శకలం అపోఫిస్ గురించి అధ్యయనం చేయడానికి 2028 లో 'రాపిడ్ అపోఫిస్ మిషన్ ఫర్ స్పేస్ సేఫ్టీ లేదా రామ్సెస్' పేరుతో ఒక అంతరిక్ష నౌకను ప్రయోగించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు 2024 జులైలో ప్రకటించిన అంతరిక్ష సంస్థ ఏది?
    జ. యూరోపియన్ అంతరిక్ష సంస్థ
13. భారత ప్రభుత్వ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాల పై స్టీరింగ్ కమిటీ 2024 జులైలో ఒక రాష్ట్రంలోని పరందూర్ ప్రాంతంలో ఒక సరికొత్త గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయాన్ని అభివృద్ధి చేసేందుకు స్థలానికి క్లియరెన్స్ ఇచ్చింది. అది ఏ రాష్ట్రం?
    జ :తమిళనాడు
14. 'ప్రపంచంలో అడవుల పరిస్థితులు 2024: మరింత సుస్థిరమైన భవిష్యత్తు దిశగా అడవుల రంగంలో ఆవిష్కరణలు' పేరుతో 2024 జులైలో ఒక నివేదిక విడుదలైంది. ఇందులో 2010-2020 మధ్య కాలంలో అటవీ విస్తీర్ణాన్ని గణనీయమైన రీతిలో పెంచిన దేశాలలో భారత్ 3వ ర్యాంకు సంపాదించింది. ఈ నివేదికను ఏ సంస్థ విడుదల చేసింది?
    జ. ఆహారం, వ్యవసాయ సంస్థ
15. భారత్ లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగంలో 'వాతావరణ మార్పుల తగ్గింపు, సర్దుబాట్ల ప్రాజెక్టులకు సంబంధించిన సామర్థ్యాల నిర్మాణం కోసం ఆర్థిక వనరులు అందించేందుకు చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంకుకు (సిడ్బీ) 200 మిలియన్ డాలర్ల రుణాలు, 15.6 మిలియన్ డాలర్ల గ్రాంట్లను 2024 జులైలో ఆమోదించిన సంస్థ ఏది?
    జ : హరిత వాతావరణ నిధి

**డా జొన్నకూటి ప్రమోద్ కుమార్**
**9490833108.**

## అహో అనేలా.. ఆతిథ్యం!




**పాడేరు, (విశాఖ సమాచారమ్):–** జిల్లాలో పర్యాటకానికి కొత్త సొబగులు అద్దేలా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వైకాపా హయాంలో పర్యాటకం పేరుచెప్పి రూ. 500 కోట్లతో రుషికొండ ప్యాలెస్ నిర్మించుకున్నారు తప్ప ఉమ్మడి విశాఖ జిల్లాలోని పర్యాటక ప్రాంతాలకు ఒక్క పైసా కూడా ఖర్చుచేయలేదు. పర్యాటకుల గమ్యస్థానంగా నిలిచే విశాఖతోపాటు తూర్పు కనుమల అందాలను నిర్లక్ష్యం చేశారు. కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత ఈ రంగాన్ని గాడిలో పెడుతోంది. సరికొత్త ఆతిథ్యాలను పరిచయం చేయబోతోంది. ఇప్పటికే అరకు చలి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. మున్ముందు అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో పర్యాటకానికి మరింత శోభను చేకూర్చేలా కార్యక్రమాలను చేపట్టబోతున్నారు.

ఏజెన్సీలో గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలతోపాటు ప్రకృతి అందాలు పర్యాటకులను కట్టిపడేస్తుంటాయి. మన్యంలో ఒక్కరోజైనా మకాం వేసి ఆసాంతం తిలకించాలని ఆశపడుతుంటారు. సీజన్‌లో వచ్చే పర్యాటకుల సంఖ్యకు తగ్గ వసతులైతే లేవు. ప్రైవేటు వ్యక్తులు చిన్నపాటి గుడారాలు ఏర్పాటు చేసి పెద్ద మొత్తంలో వసూళ్లు చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వమే పీపీపీ విధానంలో కొత్త ఆతిథ్యాన్ని తీసుకురావాలని ఆలోచన చేస్తుంది.

టెంట్ సిటీ పేరుతో అరకు, తాజంగి పరిసరాల్లో హొటళ్లను తలపించేలా గుడారాలు ఏర్పాటు చేయనున్నారు. బడ్జెట్ హొటల్‌తోపాటు స్టార్ హొటల్‌కు తీసిపోని విధంగా వీటిని అందుబాటులోకి తేవాలని చూస్తున్నారు. గుజరాత్, ఉత్తరప్రదేశ్‌లలో ఈ రకమైన వసతి సదుపాయాలను కల్పిస్తున్నారు. గిరిజనుల ఇళ్లల్లోనే పర్యాటకులు బసచేసేలా.. వాటిని తీర్చిదిద్దడానికి ప్రణాళికలు చేస్తున్నారు. ఇటీవల ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ డుంబ్రిగుడ మండలం కురిడి గ్రామానికి వెళ్లి అదనపు ఆదాయం రావాలంటే హొం స్టేల ఏర్పాటుపై ప్రస్తావించారు. ఆ తర్వాత అధికారులు వెళ్లి గ్రామంలో 53 ఇళ్లను సర్వే చేసి అందులో 15 గృహాలను హొంస్టేకు అనువుగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

అరకు, తాజంగి, వంతలూరు గ్రామాల్లో ఈ సదుపాయాలను కల్పించేందుకు అడుగులు వేస్తున్నారు. కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ తరహా పర్యాటకం అక్కడి స్థానికులకు మంచి ఆదాయాన్నిస్తోంది.

పర్యాటకంలో కొత్తగా జల విమానాలను తీసుకురాబోతున్నారు. రాష్ట్రంలో ఎనిమిదిచోట్ల వాటర్ డ్రోమ్‌లను ఏర్పాటు చేయడానికి ప్రతిపాదిస్తే అందులో మూడు ఉమ్మడి జిల్లాలోనే ఉన్నాయి.

లంబసింగి సమీపంలోని తాజంగి జలాశయం ఉంది. అక్కడ జలవిమానం దిగడానికి అవకాశం ఉంది. ముంచంగిపుట్టు సమీపంలో జోలాపుట్టు జలాశయం, సుజకోట, పెదగుడ పరిదిలోని మత్స్యగెడ్డను వీటి కోసం పరిశీలిస్తున్నారు. అక్కడ నుంచి అరకు వచ్చేందుకు రోడ్డు మార్గాలను అభివృద్ధి చేయనున్నారు.

అనకాపల్లి జిల్లా పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం బీచ్‌ను అభివృద్ధి చేయడానికి ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. ఎంపీ సి.ఎం.రమేశ్ కేంద్ర మంత్రితో ఈ బీచ్ అభివృద్ధిపై చర్చించారు. సినిమా షూటింగ్‌లకు అనువైన ప్రాంతం కావడంతో పర్యాటకంగానూ అభివృద్ధి చేయాలని భావిస్తున్నారు.

## ప్రతిభావంతులకు పురస్కారం

**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, గురుకులాలు, వసతి గృహాల్లో చదివిన విద్యార్థులు ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో మెరుగైన ఫలితాలు సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా విద్యా సంస్థల్లో అందరికంటే ముందు నిలిచిన పలువురు విద్యార్థులను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం నగదు పురస్కారాలు, జ్ఞాపికలతో సన్మానించింది. జిల్లాలోని వివిధ విద్యా సంస్థల్లో చదివిన పలువురు విద్యార్థులు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. సాంక్షేమ సంక్షేమ వసతి గృహాల్లో ఉత్తీర్ణత పెరిగేందుకు కృషి చేసిన భీమునిపట్నం కళాశాల వసతి గృహం సంక్షేమ అధికారి ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు.

రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు: జిల్లాలోని శ్రీకృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో చదివిన పి.ఆకాశ్, కోనాం పాఠశాలలో చదివిన ఎన్.తను శ్రీ పదో తరగతిలో 590 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించి, సత్కారం అందుకున్నారు. కొమ్మాది సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చదివిన డి.రాజేశ్వరి 588 మార్కులతో మూడో ర్యాంకు సాధించింది. మారికవలస గిరిజన సంక్షేమ పాఠశాలలో చదివిన కె.తేజస్విని 586 మార్కులు సాధించింది. కొమ్మాదిలోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో విద్యనభ్యసించిన ఎన్.మోద ప్రియాంక (ఎంపీసీ) 983 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు కైవసం చేసుకుంది.

పురస్కారాలు అందుకున్న పదో తరగతి విద్యార్థుల్లో కె.నవీన (సాంఘిక సంక్షేమ వసతి గృహం, పరవాడబీ 571 మార్కులు)బీ బిడ్డిక గీతిక (గిరిజన సంక్షేమ పాఠశాల, మారికవలస, 567 మార్కులు) ఉన్నారు. ఇంటర్ విద్యార్థుల్లో జి.రమ్య (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్, కొమ్మాది, 979 మార్కులు)బీ డీపురు శ్రీదుర్గ (గిరిజన సంక్షేమ పాఠశాల, మారికవలస, 978 మార్కులు) ఉన్నారు.

## జనసేన పార్టీలో భారీగా చేరికలు



**నర్సీపట్నం, (విశాఖ సమాచారమ్):-** జనసేన పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు సమక్షంలో గురువారం పెందుర్తి కార్యాలయంలో నర్సీపట్నం నియోజకవర్గానికి చెందిన వైసిపిపార్టీ నుంచి నాయకులు జనసేన పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. నర్సీపట్నం మండల వైస్ ఎంపీపీ ఇన్నం రత్నం, ఇన్నం రమణ, నర్సీపట్నం వైసీపీ సీనియర్ నాయకులు మీసాల సత్యనారాయణ, నాతవరం మండలం వైసీపీ మాజీ యూత్ అధ్యక్షులు పోలుపర్తి శ్రీనివాస్, రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు, భవన నిర్మాణ సంఘం అధ్యక్షులు పసుపులేటి అప్పలనాయుడు బొగ్గు మోహన్, దుర్గా ప్రసాద్, అడ్డూరి రామారావు, దేవర సత్యనారాయణమూర్తి, మామిడి అరుణ తదితరులు నర్సీపట్నం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీర సూర్యచంద్ర ఆధ్వర్యంలో పంచకర్ల రమేష్ బాబును కలిసి పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారు అంకితభావంతో పని చేయాలన్నారు. జనసేన అధ్యక్షులు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఊడి చక్రవర్తి, జిల్లా కార్యదర్శి పంచడ హరినాథ్ అల్లాడ సురేష్, గొలగొండ మండల అధ్యక్షులు గండం దొరబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు కోన నారాయణరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు లింటల్ లెవెల్ బిల్లు వెంటనే చెల్లించాలి



**అరకులోయ, (విశాఖ సమాచారమ్):-** ఆదివాసి గిరిజన సంఘం అరకు వేలి మండల అధ్యక్ష కార్యదర్శులు గెమ్మెల చిన్నబాబు గత్తుం బుజ్జిబాబు సుంకరమెట్ట పంచాయతీ సంగం వలస గ్రామంలో పర్యటన చేస్తూ పీఎం జన్మన్ ఇల్లు నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులు మొదటి దశ బిల్లులతో లింటల్ లెవెల్ వరకు నిర్మాణాలు చేసి లింటల్ లెవెల్ బిల్లు కోసం ఎదురు చూస్తున్నారు. హౌసింగ్ అధికారులు లింటల్ లెవెల్ ఫొటోస్ తీసి నెలలు గడుస్తున్నా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం లేదు. గిరిజన ప్రాంతంలో వర్ష కాలం వ్యవసాయ పనులు ప్రారంభం కాకా ముందే ఇల్లు నిర్మాణాలు చేసిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు చెల్లించి ఇల్లు నిర్మాణాలు వేగవంతంగ పూర్తి చేయడానికి సహకరించాలి. ఒక వైపు కేంద్ర ప్రభుత్వం పీఎం-జన్మన్ హౌసింగ్ 2026 సంవత్సరం మొదటి కళ్ల పూర్తి చేయాలి అని ప్రకటిస్తూ ఇల్లు నిర్మాణాలు పూర్తి చేస్తున్న లబ్ధిదారులకు బిల్లు లు చెల్లించక పోతే ఎలా నిర్మాణాలు పూర్తి అవుతాయి. అల్లూరి జిల్లా వ్యాప్తంగా పీఎం జన్మన్ లబ్ధిదారులు లింటల్ లెవెల్ వరకు నిర్మాణాలు పూర్తి చేసి బిల్లుల కోసం హౌసింగ్ ఆఫీస్ ల చుట్టూ తిరుగుతున్నారు. బడ్జెట్ లేదని కారణాలు చూపుతూ కాలక్షేపం చేస్తే ప్రభుత్వం అనుకున్న సమయనికి ఇల్లులు పూర్తి అయ్యే పరిస్థితి లేదు. పీఎం -జన్మన్ ద్వారా ప్రతి పీవీటిజి కుటుంబానికి సొంత ఇంటి కళా నెరవేరుతుంది. అని గొప్పలు చెప్పే ప్రభుత్వం ఇల్లు నిర్మాణాలు చేసిన లబ్ధిదారులకు ఇల్లు బిల్లులు జాప్యం చేస్తే ఎలా పేద ఆదివాసీలు ఇల్లు నిర్మించుకోగలరు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే పీఎం జన్మన్ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్ చేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు టి జోషి గ్రామస్తులు పాల్గొన్నారు.

## కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో రైతు సదస్సు




**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** గ్రామీణ పని అవగాహన అనుభవ కార్యక్రమంలో భాగంగా మండలంలో గల పి. భీమవరం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం కొండెంపూడి వారి ఆధ్వర్యంలో బుధవారం రైతు సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ ముకుందరావు మాట్లాడుతూ రైతులు మేలు రకమైన వంగడాలను వినియోగించడం ద్వారా అధిక దిగుబడిలను సాధించవచ్చునన్నారు. అలాగే వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు ప్రదర్శనలను పరిశీలించారు. వ్యవసాయ విద్యార్థులు పని అనుభవాన్ని రైతులతో పంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీన్ కే యోష, కోఆర్డినేటర్ రాజకుమార్, స్థానిక సర్పంచ్ పినపోలు రామునాయుడు, పాల సంఘం కార్యదర్శి పినపోలు రామదాసు, రైతులు వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):-** రెడ్ క్రాస్ డే మరియు ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ సంధర్భంగా గొడుగు వాకర్స్అసోసియేషన్ ఆధ్వర్యంలో శివాజీ పార్కు ఎదురుగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సి జి- 101 డిస్టిక్ గవర్న ర్ కే . ద్వారకానాథ్ ఎలక్టె గవర్నర్ మహేష్ , మాజీ ఐ ఐ పీ ఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వి ఎస్ ఆర్ కె ప్రసాద్ , శ్రీమతి లక్ష్మి ఈ కార్యక్రమాన్ని న్ని నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కే . శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సెల్యూట్ ఇండియన్ ఆర్మీ నినాదంతో సంఘీభావంగా భారీ ర్యాలీ



**నక్కపల్లి, (విశాఖ సమాచారమ్):-** మండల కేంద్రము బియస్ హాకీ క్లబ్ ఆధ్వర్యంలో దేశ రక్షణ కోసం అహర్నిశలు పోరాడుతూ విజయవంతంగా ఆపరేషన్ సింధూర్ చేపట్టిన భారత సైన్యానికి సంఘీభావం తో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోచ్ రాంబాబు, కార్యదర్శి తాతాజీ పట్టణ పురవీధుల్లో హాకీ క్రీడాకారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మేరా భారత్ మహాన్, జై భారత్, జై జై భారత్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఆపరేషన్ సింధూర్ చేపట్టిన మన సైన్యం విజయం సాదించాలని ఆకాంక్షి%శీ%చారు. ప్రతి దేశ గౌరవం, రక్షణ, అక్కడి సైన్యం పై ఆధారపడిఉంటదని భద్రతా బలగాలు ఎంత బలంగా ఉంటే ప్రజలు క్షేమంగా ఉంటారన్నారు. ఉగ్రదాడికి ప్రతీకారం గా పాకిస్తాన్ పై మన సైనికులు చేస్తున్న వీరోచిత పోరాటం లో విజయం సాధించాలని సంఘీభావం గా ఈ ర్యాలీ నిర్వహించడం జరిగింది అని అన్నారు. ఈ ర్యాలీలో భారత సైనికులకు బియస్ హాకీ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షులు చిన్న అప్పారావు, కొల్నాటి నానాజీ, రామచంద్రరావు, ప్రశాంత్, శివాజీ, వెంకటరమణ, సంఘీభావం తెలిపారు.

## సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):-** రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పీలా గోవింద సత్యనారాయణ గురువారం, స్థానిక టీడీపీ కార్యాలయంలో ఇటీవల సీఎం సహాయ నిధి నుండి మంజూరు అయిన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. 5గురులబ్దిదారులకు 12లక్షల రూపాయిల సీఎం సహాయ నిధి చెక్కులను వారికీ అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ,ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రైవేటుగా వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పేదలను ఆర్థికంగా ఆదుకోవడానికి సీఎం సహాయ నిధి ఇస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాయల మురళి, గొంతిన శ్రీనివాసరావు,కర్రీబాబీ,సిద్ధిరెడ్డిశ్రీనివాసరావు, తలారి కాశీ నాయుడు, కాండ్రేగుల సతీష్, షేక్ బాబర్, ఉల్లింగల రమేష్, నైనంశెట్టి రమణ రావు,తాకాసి కృష్ణా, చిదిరెడ్డి శ్రీను, పవన్ కుమార్ తదితరులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## తక్కువ బస్సులు తప్పని తిప్పలు



రద్దీ మార్గాల్లో బస్సులు కుదించడం తగదని..పునరుద్ధరించాలని ప్రయాణికులు పేర్కొన్నారు. చాలా బస్సులు సమయపాలన పాటించటం లేదన్నారు. బుధవారం 'ఈనాడు' నిర్వహించిన 'డయల్ యువర్ ఆర్టీసీ ఈడీ' కార్యక్రమానికి విశేష స్పందన వచ్చింది. విశాఖ, అనకాపల్లి జిల్లాల ప్రయాణికులు తమ ఇబ్బందులను ఈడీ కె.ఎస్.బ్రహ్మానందరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలు ఆలకించిన ఈడీ..పరిశీలించి పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా ధికారి అప్పలనాయుడు పాల్గొన్నారు.

**ప్రశ్న** : విశాఖ-చోడవరం రూట్లో 300సీ బస్సులు అదనంగా నడపాలి. సాయంత్రం అయిదు తర్వాత బస్సులు ఉండడం లేదు. దీంతో ఆటోల్లో ప్రయాణించాల్సి వస్తుంది. కొన్నింటిని పినగాడి మీదుగా నడిపితే బాగుంటుంది.

– ప్రసన్న, శ్రీలేఖ, అరుణ్కుమార్, రామకృష్ణ, శివ, విజయ్కుమార్.

ఈడీ సమాధానం : డిమాండున్న రూట్లలో అదనపు బస్సులను తప్పక పెంచుతాం.

నర్సీపట్నం నుంచి విజయవాడకు గతంలో రాత్రి ఒక బస్సు నడిపేవారు. పాలకొల్లుకు ఒకటి ఉండేది. ప్రస్తుతం ఆ రెండింటినీ ఆపేశారు. వాటిని పునరుద్ధరించాలి.?

– జి.శ్రీరామ్మూర్తి 3: ఆ సర్వీసులను మళ్లీ పునరుద్ధరిస్తాం.

అనకాపల్లి నుంచి పెందుర్తి మీదుగా విజయనగరం వెళ్లే సర్వీసులు ఒకదాని వెంట మరొకటి వస్తున్నాయి. సమయపాలన ఉండడంలేదు. ?

– ఎస్.వెంకట్రావు, ప్రహ్లాదపురం. 3: పరిశీలించి సరిదిద్దేలా డిపో మేనేజర్లకు సూచిస్తాం.

ఇసుకతోట బస్టాండు వద్ద బస్సులు నిలపాలి. అనకాపల్లి నుంచి విజయనగరం వెళ్లేవి, 111వీ, 222 సర్వీసులు ఆగడం లేదు. దీంతో శివాజీపాలెం, హెచ్బీకాలనీ, ఎంవీపీ కాలనీ, ఇసుకతోట వాసులకు అవస్థలు తప్పడం లేదు. ?

– శంకర్రావు, ఇసుకతోట. 3: బస్సులు ఎందుకు ఆగడం లేదో తెలుసుకొని నిలిపేలా చూస్తాం.

20ఏ సర్వీసును కొనసాగించాలి. హెచ్బీకాలనీ నుంచి సీతమ్మధార మీదుగా పాతపోస్టాఫీసు వరకు గతంలో సర్వీసులు నడిపేవారు. ప్రస్తుతం ఆపేశారు. ?

– కె.కృష్ణమూర్తి, శ్రీనివాసరావు, జోగాప్రసాద్, కె.డానియర్, సాయి, బాబ్జి, హెచ్బీకాలనీ

**ఈ సర్వీసు పునరుద్ధరణపై ఆలోచిస్తాం.**

చినముషివాడ శ్రమశక్తి నగర్ నుంచి పోర్టు ఆసుపత్రి, అక్కడి నుంచి జగదాంబ మీదుగా బీచ్కు సర్వీసులు నడపాలి. నేరుగా వెళ్లే బస్సులు లేక రెండు, మూడు బస్సులు మారాల్సి వస్తుంది.?

– శంకరప్రసాద్, జి.జగన్నాథస్వామి, చినముషివాడ.

ఈ రూటులో బస్సు కొత్తగా ఏర్పాటు చేయాలి. పరిశీలిస్తాం.

స్టీల్ప్లాంట్ కోకోవెన్ వరకు బస్సు నడపాలి.?

– రాధాకృష్ణ, అక్కిరెడ్డిపాలెం.

అక్కడికి వెళ్లేలా 50 మంది వరకు ప్రయాణికులుంటే తప్పక నడుపుతాం.

విశాఖ నుంచి పలాస మీదుగా రాజపురానికి వెళ్లే రాత్రి సర్వీసు తొలగించారు. దాన్ని పునరుద్ధరించాలి.?

–బి.వి.రమణమూర్తి.

ఈ సర్వీసు అవసరంపై సర్వే చేసి.. పరిస్థితి ఆధారంగా కొనసాగిస్తాం.

222 తగరపువలస బస్సు పేరును చిట్టివలస పేరుతో నడపాలి?

– పల్లా వెంకటరావు,

పేరు మార్పుపై సూచనను పరిశీలిస్తాం.

నర్సీపట్నం నుంచి విశాఖకు తిరిగే ఎక్స్ప్రెస్సులు బైపాస్ మీదుగా నడపాలి.

– లక్ష్మీతిలక్

పరిశీలించి నిర్ణయం తీసుకుంటాం.

కొత్తవలస-ఆర్కేబీచ్ మధ్య నడిపే నంబరు-68 బస్సు సర్వీసులను తగ్గించడంతో ఇబ్బంది పడుతున్నాం.?

– బి.నాగేశ్వరరావు

పరిశీలించి అవసరం మేరకు ఏర్పాటు చేస్తాం.

పాతగాజుకలో బస్టాండ్ లేదు. దీంతో చాలా మంది ఇబ్బంది పడుతున్నారు.?

– జి.శ్రీనివాసరావు

అక్కడ బస్టాండు ఏర్పాటు చేస్తాం.

నర్సీపట్నం ఆర్టీసీ బస్టాండులో నెట్ సెంటర్ లేక ఇబ్బందిపడుతున్నాం. ?

– శ్రీవిద్య, ప్రకాష్

టెండర్ పిలిచి సెంటర్ ఏర్పాటు చేస్తాం.

ఎంవీపీ మీదుగా తిరిగే రూటు నంబరు 14, 540 బస్సులు గతంలో ఉండేవి. 900 నంబరు బస్సులు తగ్గించేశారు.?

– వెంకటలక్ష్మి, శ్రీధర్, పి.శారద, సాయిబాబు, దుర్గారావు, ఎం.లక్ష్మి, బి.లత, ఇందిరా, కె.శివారెడ్డి – ఎంవీపీ కాలనీ, పెదవాల్తేరు, వెంకోజీపాలెం.

ఈ రూట్లలో డిమాండు ఆధారంగా సర్వీసులను పునరుద్ధరిస్తాం.

పెందుర్తి సమీప పురుషోత్తపురం రిక్వెస్టు బస్టాపు వద్ద బస్సులు ఆపడంలేదు.?

–శ్రీనివాసరావు 3: అక్కడ బస్సులు నిలిపేలా తక్షణమే ఆదేశాలిస్తాం.

ఎలమంచిలి-విశాఖ సర్వీసులు వెంట వెంటనే వస్తుండటంతో ప్రయాణికులకు అందుబాటులో ఉండటం లేదు.?

– కె.వెంకటరావు

డిపో మేనేజర్కు తెలియజేసి ఈ సమస్య పరిష్కరిస్తాం.

విజయనగరం తిరిగే సర్వీసులు 111వి, 211 బస్సులు తగరపువలస ఊళ్లోకి రావడంలేదు.?

– సురేష్

అవసరం మేరకు పరిశీలిస్తాం.

దూరప్రాంతాల నుంచి వచ్చే బస్సులు తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం వద్ద నిలిపేలా చూడాలి.?

–కుమార్.

ఎందుకు ఆగడంలేదో పరిశీలించి నిలిపేలా ఆదేశిస్తాం.

నరవ వద్ద బస్టాపు ఏర్పాటు చేయాలి. ?

– సత్యనారాయణ

పరిశీలిస్తాం.

టోల్ఫ్రీ నంబర్ 149కి ఫోన్ చేస్తే స్పందించడంలేదు.?

– శ్రీనివాసరావు, స్టీల్ప్లాంట్.

ఆయా డిపో మేనేజర్ల ఫోన్నెంబర్లు అందుబాటులో ఉంచుతాం.

ఎక్స్ప్రెస్, సూపర్లగ్జరీ బస్సులు అనకాపల్లి టౌన్లోకి రావడం లేదు.?

– నాగభూషణరావు

టౌన్లోకి ఇప్పటికే కొన్ని వస్తున్నాయి. మిగిలిన వాటిపై పరిశీలిస్తాం.

నర్సీపట్నం-కేడీపేటకు గతంలో ఉదయం 5గంటలకు బస్సు ఉండేది. ప్రస్తుతం నిలిపేశారు.?

–వాసు

బస్సు పునరుద్ధరిస్తాం.

విశాఖ నుంచి నెల్లూరుకి ఉదయం వేళల్లో బస్సు నడపాలి.?

– రాజా

ఇప్పటికే రోజూ సాయంత్రం మూడు సర్వీసులు నడుపుతున్నాం. ఉదయం సర్వీసుపై పరిశీలిస్తాం.

దూర ప్రాంత బస్సులు కాంప్లెక్సు నుంచి నడపాలి.?

– ఆదినారాయణ.

దూర ప్రాంతాలకు సంబంధించి ఏ బస్సైనా ద్వారకా బస్టాండుకు వస్తుంది.

300, 55 సర్వీసులన్నీ వెంటవెంటనే ఒకేసారి గోపాలపట్నం వస్తున్నాయి.?

–కె.శంకరరావు, గోపాలపట్నం.

తక్షణమే సంబంధిత డిపో మేనేజర్ల దృష్టికి తీసుకెళ్తాం.

ఇసుకతోట, హనుమంతవాక వద్ద బస్సుల్లోకి హిజ్రాలు ఎక్కి ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారు. వాళ్లను నిలువరించాలి.?

– గోపి, ఆరిలోవ.

ఈ అంశంపై డ్రైవర్లకు తగు సూచనలు చేస్తాం.

చీడికాడ మండలం అర్జునగిరికి 15 ఏళ్లుగా పల్లెవెలుగు నడిపేవారు. 8 నెలల నుంచి ఆపేశారు.?

–సోమశ్వర్రావు

సర్వీసు పునరుద్ధరిస్తాం.

## జె.ఎస్ ఎంటర్ప్రైజెస్ ను ప్రారంభించిన పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



**పార్వతీపురం, (విశాఖ సమాచారమ్):-** పార్వతీపురం మండలం పెదబొండపల్లి రోడ్డుకు సమీపంలో ఉన్న జె.ఎస్ఎంటర్ప్రైజెస్ ను పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర రిబ్బన్ కత్తిరించి వ్యాపారాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ వ్యాపారం అభివృద్ధి చెందాలని ఆయన యజమానికి తన ఆశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ షాకా...!! హత్యా...!!

● పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ లో అనుమానస్పదంగా వ్యక్తి మృతి.. ● పలు అనుమానాలకు తవిస్తున్న మృతి... ● పొంతన లేని సమాదానాలు తో ఫ్యాక్టరీ యాజమాన్యం.. ● కుటుంబస్తులు, గ్రామస్తులు ఫ్యాక్టరీ వద్ద పెద్ద ఎత్తున ధర్నా.. ● ఎల్. బి. పి అగ్రహారం లో అలుముకున్న 'విషాద ఛాయలు' ● బోరున విలపిస్తున్న గర్భిణీ యైన భార్య, 2 ఏళ్ల కుమారుడు ● విచారణ చేస్తున్న పోలీస్‌లు...



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):-** బుచ్చయ్యపేట మండలంలోని ఎల్. బి. పి అగ్రహారం శివారు లో గల పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ వ్యక్తి మృతి చెందిన సంఘటన పలు అనుమానాలకు తవిస్తుంది. వివరాలు లోకి వెళితే ఎల్. బి. పి అగ్రహారం గ్రామానికి చెందిన పల్లా అప్పన్న (35) అనే వ్యక్తి గత 10 సంవత్సరాలనుండి పామ్ ఆయిల్ ఫ్యాక్టరీ లో జేసీబీ, ట్రాక్టర్లు డ్రైవ్ గా రెగ్యులర్ ఉద్యోగి గా పనిస్తున్నాడు. మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చి ఒంటి గంట సమయం లో తిరిగి ఫ్యాక్టరీ వెళ్లిన వ్యక్తి విగత జీవి గా కనిపించాడు. అయితే ఫ్యాక్టరీ యాజమాన్యం అప్పన్న తాటికాయలు కొడుతూ కత్తి విద్యుత్ వైరుకు తగిలి షాక్ కు గురై మృతి చెబుతున్నారు. అయితే కరెంట్ షాక్ తో మృతి చెందినట్లు గా కుటుంబ సభ్యులు కు కానీ బంధువులు కు కానీ ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఫ్యాక్టరీ మేనేజర్, ఫ్యాక్టరీ సిబ్బంది కలసి వడ్డాది ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకువెళ్లగా అక్కడ వైద్యులు అందుబాటులో లేనందున చోడవరం సంజీవిని హాస్పిటల్ కి ఫ్యాక్టరీ తీసుకువెళ్లగా అప్పన్న మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తిరిగి అక్కడ నుండి అప్పన్న మృతదేహాన్ని చెప్పులు, టోపీ ని ఫ్యాక్టరీ దగ్గర లో ఒక చెట్టు కింద పడేసి విధ్యుత్ షాక్ తో మృతి చెందినట్లు తరువాత ఫ్యాక్టరీ మేనేజర్, యాజమాన్యం ఫ్యాక్టరీ సిబ్బంది ద్వారా సమాచారం అందజేశారు. అయితే మృతి చెందిన అప్పన్న మధ్యాహ్నం భోజనం చేసి వచ్చిన తరువాత తాటికాయలు కొట్టుకొని ఎలా తింటాడని, ఇనుప కత్తి కరెంట్ వైరు కు తగిలి షాక్ కొట్టి చనిపోయాడని ఫ్యాక్టరీ యాజమాన్యం చెబుతున్నప్పటకి మృతి చెందిన అప్పన్న కాళ్ళు, చేతులు కానీ ఎక్కడ కరెంట్ షాక్ కొట్టినట్లు కానీ కాలినట్లు కానీ కనిపించడం లేదని ఫ్యాక్టరీ మేనేజర్, యాజమాన్యం కనిపించకుండా తప్పించుకొని తిరుగుతున్నారని కుటుంబస్తులు, బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అప్పన్న మృతి చెందిన విషయం తెలుసుకున్న కుటుంబస్తులు, గ్రామస్తులు ఒక్కసారి ఫ్యాక్టరీ ని చుట్టి ముట్టి, అప్పన్న ఎలా మృతి చెందాడు. సంఘటన జరిగిన వెంటనే ఎందుకు కుటుంబసభ్యులు కు సమాచారం ఇవ్వలేదని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టి నినాదాలు చేశారు. అప్పన్న మృతి చెందిన ఘటన ఫ్యాక్టరీ లో సీసీ కెమెరాల్లో రికార్డు లను పరిశించాలని కుటుంబస్తులు, మీడియా అడగగా ఫ్యాక్టరీ అనుమాన్సపదంగా ఉన్న అప్పన్న మృతి వెనకాల నిజాన్ని నిగ్గు తెల్చాలని, అప్పన్న కుటుంబానికి న్యాయం చేయాలని పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నారు. మృతి చెందిన అప్పన్న కు 2 ఏళ్ల కుమారుడు కృతిక్, 8 నెలలు గర్భిణీ యైన భార్య రేవతి ఉన్నారు. ఈ సంఘటన తో ఎల్. బి. పి అగ్రహారంలో 'విషాద ఛాయలు' అలుము కున్నాయి.



జరిగిన ఘుతూకాన్ని తలచుకొని భార్య, కుమారుడు దుఃఖ సముద్రం లో మునిగి బోరున విలపిస్తున్నారు. జరిగిన ఈ ఘటన పై చోడవరం సీఐ అప్పలరాజు, బుచ్చయ్యపేట ఎస్సై భాస్కర రావు, రావికమతం ఎస్సై రఘువర్మ లు విచారణ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోండి

**గోపాలపురం, (విశాఖ సమాచారమ్):-** గోపాలపురం మండల వ్యాప్తంగా ఉన్న గ్రామ సచివాలయాలు లో కొత్త రేషన్ కార్డులు దరఖాస్తులు స్వీకరణ ప్రక్రియ మొదలైందని తహసిల్దార్ అజయ్ బాబు అన్నారు ఈ సందర్భంగా తాసిల్దారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త రేషన్ కార్డుల దరఖాస్తులకు అవకాశం కల్పిస్తుందన్నారు కొత్త రేషన్ కార్డులు కార్డులో ఉన్న చిరునామా మార్పులు కార్డుల విభజన, సభ్యులను చేర్చడం ఏడు రకాల సేవలకు అవకాశం కల్పిస్తుందన్నారు దరఖాస్తు అనంతరం క్యూఆర్ కోడ్ ముద్రించిన నూతన కార్డును లబ్ధిదారునికి ఇవ్వడం జరుగుతుందన్నారు పై వాటిలో ఏదైనా అవసరం ఉన్నవారు మండలంలో ఉన్నటువంటి గ్రామ సచివాలయాలను సంప్రదించాలని తాసిల్దార్ అజయ్ బాబు అన్నారు.

2nd pages11.qxd 5/8/2025 7:39 PM Page 7



## కళ్యాణమండపం పునఃప్రారంభం



**విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–** గురువారం సుమారు 40 లక్షల వ్యయంతో సెక్టార్-1, ఎంవీపీ కాలనీ (వెంకోజిపాలెం) లో కళ్యాణమండపం మేయర్ పీలా శ్రీనివాసరావు , విశాఖ తూర్పు నియోజక వర్గం శాసన సభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు విఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ మరియు మెట్రోపాలిటన్ కమీషనర్ . కె.ఎస్. విశ్వనాథన్ చేతులమీదుగా నవీకరణ అనంతరము పునః ప్రారంభోత్సవం గావించబడినది. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ ఇది పేద, మధ్య తరగతి వర్గాలకు అందుబాటులో ఉండే కళ్యాణ మండపం అని చాలా తక్కువ సమయంలో దీని నవీకరణకు సాంకేతిక విభాగం సమష్టిగా చేసిన కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ బొలిశెట్టి సత్యనారాయణ గారు, జాయింట్ కమీషనర్ రమేష్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, ప్రధాన గణాంకాధికారి హరిప్రసాద్, సుజాతా శివానీ, పర్యవేక్షక ఇంజనీర్ భవానీ శంకర్, కార్యనిర్వహక ఇంజినీర్లు రామరాజు, సుధీర్, ఉప కార్య నిర్వాహక ఇంజనీర్ శిరీష, సహాయక ఇంజనీర్ శర్మ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## పొట్టిదొరపాలెం గుర్రపు గెడ్డ పై వంతెన నిర్మాణం చేపట్టాలి

- రైతుల కష్టాలు తొలగాలంటే వంతెన నిర్మాణం అత్యవసరం
- ప్రజలు, రైతులతో కలసి పర్యటించిన నియోజకవర్గ ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు



**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):–** చోడవరం నియోజవర్గం బుచ్చయ్యపేట మండలం పొట్టిదొరపాలెం గ్రామానికి సంబంధించిన సుమారు 800 ఎకరాల భూమికి సంబంధించి రైతులు, వ్యవసాయ కూలీలు నిరంతరం గుర్రం గెడ్డ ను దాటి వారి వ్యవసాయ భూములకు పనుల నిమిత్తము వెళ్లి రావడం జరుగుతుంది. సంవత్సరంలో చాలా కాలం పాటు ఉదృతమైన ప్రవాహంతో నీరు ప్రవహించడం వల్ల ఆ గెడ్డను దాటి వ్యవసాయ పనులు చేసుకోవడం అనేది వారికి అత్యంత కష్టసాధ్యంగా ఉంది. దశాబ్దాలు తరబడి ఎన్నో వ్యయప్రయాసులకు గురగుతూ పలు సందర్భాల్లో కొంతమంది ప్రాణాలు కోల్పోయిన సంఘటన కూడా జరగడం అత్యంత బాధాకరం. అతి ముఖ్యమైన ఈ సమస్య పరిష్కారానికి జనసేన పార్టీ చోడవరం ఇంచార్జ్ పివిఎస్ఎన్ రాజు,పార్టీ నాయకులు, రైతులు, మహిళలు తో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు, రైతులు మాట్లాడుతూ తాము ఈ గెడ్డ వలన ఎదుర్కొంటున్న సమస్యలు వర్ణనాతీతం అని, చాలా కాలం నుండి ఈ గడ్డను పై వంతెను నిర్మిస్తామన్న నాయకుల హామీ రాజకీయ హామీగానే మిగిలిపోతూ వస్తుందని తమకు ఈ గెడ్డపై వంతెన నిర్మించి న్యాయం చేయాలని ఈ విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి ఈ నిర్మాణం చేస్తే తమ అందరి భవిష్యత్తుకు భరోసాగా ఉంటుందని వ్యవసాయ పని చేసుకోవడం తమకు సులువు అవుతుందని తెలియజేశారు. ఒక మహిళ మాట్లాడుతూ తమ బంధుమైన ఓ మహిళ ఈ గెడ్డ ప్రవాహం అధిగా ఉన్నప్పుడు ప్రవాహంలో పడి చనిపోయిందని ఆమెకు నలుగురు పిల్లలు కూడా ఉన్నారని ఆ కుటుంబం అంతా అనాధలయ్యారని చెప్పడం చాలా బాధ కలిగించింది. ఈ సమస్య పై స్పందించిన రాజు అక్కడ ఉన్న రైతులు మహిళలతో మాట్లాడుతూ ఖచ్చితంగా ఈ గెడ్డపై వంతెన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలను స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ ల ద్వారా ప్రభుత్వానికి పంపించి నిధులు మంజూరు చేయించి నిర్మాణం చేయించడానికి జనసేన పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని మీ కష్టాన్ని అర్థం చేసుకున్నామని ఇక్కడ వంతెన నిర్మాణం చాలా అత్యవసరమని, అక్కడి నుంచే నేరుగా సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ఈ పరిస్థితిపై పూర్తి పరిశీలన చేసి అవసరమైన నివేదికను ప్రభుత్వానికి పంపించవలసిందిగా కోరారు. ఈ సందర్భంలో అక్కడ ఉపాధి హామీ పనుల్లో ఉన్న శ్రామికులను కలిసి వారితో పలు విషయాలను చర్చించడం జరిగింది వారు తమకి ఎదురవుతున్న ఇబ్బందులను, కష్టసుఖాలను, గ్రామ పరిస్థితులను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ నాయకులు అడపా నరసింహమూర్తి, తుమ్మపాల రమేష్, దాడి సూరి నాగేశ్వరరావు, శనివాడ నాయుడు బాబు, ఎడ్ల రామ్మూర్తి దొండా సాయి, దొండా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

## మేయర్‌ను సత్కరించిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) మేయర్ పీలా శ్రీనివాసరావు ని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా కమిటీ గురువారం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ ఉపాధ్యాయుల వివిధ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించాలని కోరడం జరిగింది. దీనిపై మేయర్ పీలా శ్రీనివాసరావు సానుకూలంగా స్పందించి, దశల వారీగా ప్రాధాన్యతా క్రమంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తుంపాల వెంకట రమణ, నక్కా శ్రీను బాబు, రాష్ట్ర కార్యదర్శి పెనుమత్స కృష్ణరాజు, జిల్లా గౌరవ అధ్యక్షులు కోట్నీ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఆరిపాక రాజా రమేష్, బుచ్చియ్య పేట మండల శాఖ అధ్యక్షులు అప్పలనాయుడు పాల్గొన్నారు.



గురువారం కేజీహెచ్ సూపరింటెంట్ శివానంద్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన ఇన్నర్ వ్యూ డైలీ న్యూస్ పేపర్ సబ్ ఎడిటర్ ఎస్ కే కుదాబాషా మరియు ముస్లిం మైనార్టీ లీడర్ మదీనా **విశాఖపట్నం, (విశాఖ సమాచారమ్):–**

## రామవరం ఉప సర్పంచ్ పై అవిశ్వాసం



**అనపర్తి, (విశాఖ సమాచారమ్):–** అనపర్తి మండలం రామవరం గ్రామ ఉపసర్పంచ్ సేవలందిస్తున్న సబ్బెళ్ళ కృష్ణారెడ్డి పాలనతీరు మాకు నచ్చలేదంటూ పాలక వర్గ సభ్యులు కొంత మంది సర్పంచ్ గిరడ గంగా భవాని తో సహా కృష్ణారెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలంటూ అవిశ్వాస నోటీసును జిల్లా ఉన్నతాధికారులకు అందజేశారు. ప్రస్తుతం ఉపసర్పంచ్ గా కొనసాగుతున్నా కృష్ణారెడ్డి నాలుగేళ్లుగా సేవలందిస్తున్నారు. వార్డు సభ్యులు చింత సురేష్ రెడ్డి , వి.వి.రామారావులతో పది మంది సభ్యులు కలసి రాజ మండ్రి ఆర్డీవో కార్యాలయ సూపరిటెండెంట్ సుజాతను కలిసి అవిశ్వాస కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.

## సకాలంలో అందేనా?



**ఏలూరు:** వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే నాటికల్లా విద్యార్థులకు అవసరమైన సామగ్రిని పంపిణీ చేస్తామంటూ అధికారులు పదేపదే చెబుతుంటారు. కానీ క్షేత్ర స్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. కొత్త విద్యా సంవత్సరం(2025–26) జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ఇంకా దాదాపు నెల రోజుల వ్యవధి మాత్రమే ఉంది. విద్యార్థులకు 9 రకాల విద్యా సామగ్రిని అందజేయాల్సి ఉండగా ఇంత వరకు నిఘంటువులు మాత్రమే జిల్లాకు చేరాయి.

మిగతావి ఎప్పుడో తెలియని పరిస్థితి.. ప్రభుత్వ బడుల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరానికి 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర'(ఎస్ఆర్‌కేవీఎం) పేరిట విద్యా సామగ్రిని ఉచితంగా పంపిణీ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. మూడు రకాల ఏకరూప వస్త్రం, ఒక జత బూట్లు, రెండు జతల సాక్సులు, ఒక బెల్టు, ఒక బ్యాగు, పాఠ్య, రాతపుస్తకాలు, నిఘంటువుల పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. 1 నుంచి 10వ తరగతి బాలురకు, 1 నుంచి 5వ తరగతి బాలికలకు బెల్టులు పంపిణీ చేయాల్సి ఉంది. 6వ తరగతిలో ప్రవేశించే వారికి 'ఆక్స్‌ఫర్డ్' నిఘంటువుల పుస్తకాలు, 1వ తరగతి వారికి 'పిక్టోరియల్' నిఘంటువుల పుస్తకాలను అందజేయాల్సి ఉంది.

జిల్లాలోని విద్యార్థులకు మొత్తం 9 లక్షల పాఠ్యపుస్తకాలు రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 3.60 లక్షలు మాత్రమే చేరాయి. 'ఆక్స్‌ఫర్డ్' నిఘంటువుల పుస్తకాలు 11,665 రావాల్సి ఉండగా పూర్తి శాతం చేరాయని సమగ్ర శిక్షా సీఎంవో రవీంద్ర తెలిపారు. 'పిక్టోరియల్' నిఘంటువుల పుస్తకాలు ఇంకా చేరలేదన్నారు. జిల్లాకు చేరిన పాఠ్య, నిఘంటువుల పుస్తకాలను ఆయా మండలాల్లోని స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. ఏకరూప వస్త్రం, బూట్లు, బెల్టులు, రాత పుస్తకాలు, స్కూలు బ్యాగులు రావాల్సి ఉందని సమగ్ర శిక్షా ఏపీసీ పంకజ్‌కుమార్ తెలిపారు. వీటికి సంబంధించిన బడ్జెట్ ఇంకా విడుదల కాలేదని, నిధులు విడుదలైన వెంటనే విద్యా సామగ్రి మొత్తం జిల్లాకు చేరుతుందని అన్నారు.

## సాయి బృందావన్ నగర్ సమస్యలను పరిష్కరించండి



**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్):–** గురువారం భారత్ వికాస్ పరిషత్ ఆంధ్ర రాష్ట్ర పర్యావరణ పరిరక్షణ కన్వీనర్, డాక్టర్ శరకడం నూకరాజు స్థానిక శ్రీ సాయి బృందావన్ నగర్ లోని రోడ్లు, మంచి నీటి కొళాయి లు, మురికి కాలువల సమస్యలను ఆంధ్ర రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ %ద% ఇన్ఫ్రాస్ట్రక్చర్ దెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ ఇంచార్జీ పీలా గోవింద సత్యనారాయణ ని కలిసి విన్నవించారు. గోవింద ఎమ్.ఎల్.ఏ.గా ఉన్నపుడు ఈప్రాంతం లో వేసిన సిమెంట్ రోడ్లు, కాలువలు, కొళాయిలు తప్ప గత నాలుగు సంవత్సరాలలో ఈప్రాంతం ఏ విధంగా అభివృద్ధి కి నోచుకోలేదన్నారు. చిన్న పాటి వర్షం కురిసినఈరోడ్లన్నీజలమయమవు.

తున్నాయనీ నూకరాజు తెలిపారు. స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కి కూడా ఈ కాలోనీ వాసులు ఈ సమస్యల ను విన్న వించారన్నారు. ఈ సమస్యల ను పరిశీలించి త్వర లోనే పరిష్కరిస్తామనీ గోవిందా హామీ ఇచ్చారని, డాక్టర్. నూకరాజు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నూకరాజు మాజీ ఎమ్మెల్యే గోవిందను శాలువాతో సత్కరించారు.

## వైద్యాధికారి ఆధ్వర్యంలో వైద్య శిబిరం



**నాతవరం, (విశాఖ సమాచారమ్):–** మండల కేంద్రమైన నాతవరం ఎస్ సి కాలనీ లో జలుబు, కీళ్ల నొప్పులు ఎక్కువగా వస్తున్నాయని వైద్యాధికారి డా.ఎం.రాజేష్ నాయుడు మరియు పంచాయతీ సెక్రెటరీ ఎల్. శేషు, ఎంపీహెచ్ఈఓ కేవి రమణ ఆధ్వర్యంలో దోమలు ఎక్కువగా ఉన్నాయని స్ప్రేయింగ్ చేయించడమైనది. అక్కడ మెడికల్ క్యాంప్ నిర్వహించడమైనది. మొత్తం 65 మంది పరీక్షించడం జరిగింది అని వారు తెలిపారు.

## పాత్రికేయుల భవనానికి భూమి పూజ



**రావికమతం, (విశాఖ సమాచారమ్):–** పాత్రికేయుల భవనానికి రావికమతం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రావి కమతం సర్పంచి గెంజి మొది నాయుడు, ఎంపీటీసీ వేపాడ నాగేశ్వరరావు, గొంప ఎంపీటీసీ గెంజి సూర్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ గంజి వెంకటరమణ, గ్రామ టిడిపి పార్టీ అధ్యక్షుడు గెంజే ఈశ్వరరావు ఆధ్వర్యంలో విలేకరుల భవనానికి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిషత్ ఆవరణలో నిర్మిస్తున్న పాత్రికేయుల భవనానికి మండల పరిషత్ నిధులు ఐదు లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందని, వాటితో విలేకరుల భవనం నిర్మాణం పూర్తి చేయడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ భవన నిర్మాణానికి సుమారు రెండు సెంట్లు భూమిని కేటాయించడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీను, అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## రాజాంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలు

**బుచ్చయ్యపేట, (విశాఖ సమాచారమ్):–** మండలంలోని రాజాం గ్రామంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి. కీర్తిశేషులు కామ్రేడ్ నాగలపల్లి సత్యనారాయణ స్థాపించిన అల్లూరి సీతారామరాజు విగ్రహనికి ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్తా ఈ కార్యక్రమం రాజాం గ్రామ నాయకులు మరిశా సతీష్, మరిసా నరేష్, మరిసా నాగప్పారావు, ఎండ పల్లి సత్యారావు, నీలకంఠపురం మాజీ సర్పంచ్ కోట సత్యనారాయణ, ఆర్ భీమవరం మాజీ సర్పంచ్ మలిరెడ్డి బాబ్జి, నాగలపల్లి లెనిన్ బాబు, కురం శ్రీను, పరవాడ శివ, వద్దాది నాయుడు, సాలా స్వామి మరిసా కూర్మ తదిరులు పాల్గొన్నారు.

## బంగారానికి తుప్పు పడుతుందన్న గాలి



14 ఏళ్లపాటు సాగిన ఓబులాపురం గనుల కేసులో ఎట్టకేలకు హైదరాబాద్ సీబీఐ కోర్టు గనుల గజనీ గాలి జనార్దనరెడ్డి కి ఏడేళ్ల జైలు శిక్ష విధించింది.ఆయనతో పాటు మరో నలుగురికి శిక్ష విధించింది.ఆయన అక్రమ గనుల తవ్వకాల తో వేలాది కోట్ల రూపాయల ఇనుప ఖనిజం విదేశాలకు తరలించినట్లు సీబీఐ తేల్చింది. దానివిలువ రూ.4 వేల కోట్ల పైమాటే అని చెబుతున్నారు.ఆయన అక్రమాస్తులు 120 వస్తువులుగా గుర్తించారు.వాటిలో 80 వస్తువులను గుర్తించినట్లు చెబుతున్నారు.ఆయన ఇంట్లో ఉన్న 53 కేజీల బంగారం సీజ్ చేశారు. దానిపై ఆయన బంగారానికి తుప్పు పడుతుంది,నా బంగారాన్ని నాకు ఇవ్వమని కోర్టును అడగడం ఆశ్చర్యం కలిగించింది.ఆయన ఇంటిలో బాత్రూమ్ లోని కమోడ్ దగ్గర్నుంచి కూర్చునే కుర్చీ బంగారంగా ఉంది.తిరుపతి స్వామి కి బంగారు కిరీటం కూడా చేయించాడు. శ్రీవారు తనను పాపాల నుంచి రక్షిస్తాడని పొరబడ్డాడు.కాని స్వామి పాపం పండేలా చేసి జైలుకు దోవచూపాడు.తాను సామాజిక సేవా చేస్తున్నానని,మాజీ మంత్రిని,ఇప్పటికే నాలుగేళ్లు శిక్ష అనుభవించానని,వయసు చూసైనా శిక్ష తగ్గించాలని న్యాయమూర్తిని అభ్యర్థించాడు.కాని న్యాయమూర్తి నీవు యావజ్జీవ శిక్ష కు అర్హుడవని అనడంతో నోరు మూసుకున్నాడు. కానిస్టేబుల్ కొడుకు కోటికి పడగలెత్తడానికి ఉమ్మడి ఏపీలో వైఎస్ అధికారంలోకి రావడంతో ఉపయోగపడింది. వారితోఉన్న చుట్టరికం తో గనులు లీజు తీసుకుని సరిహద్దులు చెరిపేసి డొల్ల కంపెనీలు సృష్టించి కోట్లరూపాయలు స్వాహ చేసారు.ఈడి పరిధిలో గాలి మీద ఉన్న కేసులు,ఆస్తుల అటాచ్ మెంట్లు తేలాల్సి ఉంది.

బెంగుళూరు కోర్టు ఇటీవల తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత అక్రమాస్తులు దాదాపు నాలు వేల కోట్ల రూపాయల ఆభరణాలు,ఇతర డాక్యుమెంట్లు,వస్తువులు ఆ ప్రభుత్వానికి అప్పజెప్పింది .ఇప్పుడు గనుల దొంగ గాలి జనార్దనరెడ్డి అక్రమాస్తులు మొత్తం ఏపీ ప్రభుత్వానికి అప్పగించాలి.తాను సంపాదించిన అక్రమాస్తుల నుంచి రూ. 500 కోట్లు ఖర్చు చేసి గాలి కుమార్తె పెళ్లి అంగ రంగవైభవంగా చేసిన విషయం విదితమే. ప్రజా సొమ్ము బొక్కిన ఇలాంటి అక్రమార్కులకు ఆస్తులు జప్తు తో పాటు జైలుశిక్ష తప్పదు.అంతేకాక ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కూడా కొల్పోయే అవకాశం ఉంది.కాని సుప్రీంకోర్టు లో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని న్యాయవాదులు చెబుతున్నా సీబీఐ కోర్టులో నిందితుడిగా రుజువైన వ్యక్తి అంత సులువుగా నిర్దోషిగా వచ్చే అవకాశం లేదు.ప్రజాప్రతినిధులపై కేసులు త్వరగా తేల్చాలని సుప్రీంకోర్టు ఆదేశాలతో గాలికి శిక్ష పడిన నేపథ్యంలో 11 కేసులున్న మాజీ ముఖ్యమంత్రి జగన్ పరిస్థితి భవిష్యత్తు లో ఎలా ఉంటుందోనని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రజా ప్రతినిధిగా జగన్ కు ఉన్న ప్రజాభిమానం ఆయనను కేసుల నుంచి తప్పించదా అన్న ఒకే ఒక్క ఆశ కనిపిస్తున్నది. ఈసారి విజయం సాధిస్తే కేసుల నుంచి విముక్తి లభిస్తుందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు.కాని జయలలిత,లాలూ ప్రసాద్ ల అనుభవాలు గుర్తువస్తే భయం వేయకతప్పడం లేదు. కాలం జగన్ను కరుణిస్తుందా లేదా అనేది చూడాలి.

**యం.వి.రామారావు**

## సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ స్థాపకులు గోపాల కృష్ణ గోఖలే

## నేడు జయంతి



19 శతాబ్ది ఉత్తరార్థం మనకు అందించిన ఉద్దండుడు గోపాలకృష్ణ గోఖలే. భారత స్వాతంత్ర్యోద్యమం ప్రజా ఉద్యమంగా రూపుదిద్దు కొనని రోజుల్లో గోపాల కృష్ణ గోఖలే ప్రజాసేవ రంగంలో విశేష కృషి చేశారు. గోఖలే 1866 మే 9 న బాంబే ప్రెసిడెన్సీ కొల్హాపూర్ లో జన్మించారు. తన 15 వ ఏట మెట్రిక్ పరీక్షల్లో కృతార్థులై 18 వ ఏట గణిత శాస్త్రంలో పట్టభద్రులైనారు. మిత్రులంతా ఐపిఎస్ కోసం ఇంగ్లాండ్ వెళ్ళమని ప్రోత్సహించారు. ఈయన ఇంజనీర్ కావాలనుకున్నాను. కుటుంబం న్యాయవాదిగా చూడాలనుకున్నారు. అయితే పరిస్థితులు ఉపాధ్యాయునిగా తయారు చేశారు. ఆర్థిక శాస్త్రంలో నిష్ణాతులైన గోఖలే దేశ ఆర్థిక వ్యవస్థపై ఎన్నో ఉపన్యాసాలు, వ్యాసాలు వెలువరించారు. సార్వజనీక సభ కార్యదర్శిగా ఈయన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. మహారాష్ట్ర రాజకీయాలలో తనదైన ముద్రవేసారు. దక్కన్ ఎడ్యుకేషన్ సొసైటీ లో ఉపాధ్యాయునిగా చేరిన గోఖలే, ఆ సంస్థలో 1891 నాటికి ప్రొఫెసర్ గా, కార్యదర్శిగా ఎదిగారు. 1897 లో ఇంగ్లాండ్ వెళ్లి వెల్బీ కమిషన్ ముందు సివిల్ మిలటరీ వ్యయం పై విలువైన సమాచారాన్ని అందించాడు. 1899 లో కాంగ్రెస్ లో ప్రవేశించి దాదాభాయి నౌరోజీ, ఫిరోజ్ షా మోహతా వంటి పెద్దల పట్ల ఎంతో గౌరవాన్ని ప్రదర్శించేవారు. వీరు కొంతకాలం సుధాకర్ అనే పత్రికకు సంపాదకత్వం వహించారు. 1899–1902లలో బాంబే శాసనసభకు ఎన్నికైనారు. దేశ ఆర్థిక స్థితిగతుల అంచనాలలో, సమస్యల పరిష్కారంలో ఈయనది అందె వేసిన చేయి. బడ్జెట్ గురించి శాసనసభలో లోతైన చర్చలు జరిపేవారు. ఉప్పు మీద వేసిన పన్ను తగ్గించేందుకు కృషి చేశారు. నిర్బంధ ప్రాథమిక విద్యకు పట్టుబట్టారు. 1905 లో భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఎన్నికైనారు. సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించారు. 1912 లో దక్షిణాఫ్రికాలో గాంధీజీ తో కలిసి అక్కడి భారతీయ సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. గాంధీజీ కి నైతిక గురువు గొఖలేనని చెపుతారు. 1914లో భారత వైస్రాయ్ ఈయనకు కె.సి.ఈ.ఈ. నైట్ కమాండర్ ఆఫ్ ది ఇండియన్ ఎంపైర్ అనే బిరుదు ను ప్రతిపాదిస్తే దానిని గోఖలే సున్నితంగా తిరస్కరించాడు. వీరు 1915 ఫిబ్రవరి 19 న పుణే లో కన్నుమూశారు.

**డా. జె.వి.ప్రమోద్ కుమార్**
**పైడిమెట్ట 9490833108.**

2nd pages11.qxd 5/8/2025 7:39 PM Page 8






# ఓ ఎజెండా ప్రకారమే భారత్‌లో క్రికెట్ కామెంట్రీ

## - హాట్ టాపిక్‌గా రోహిత్ వ్యాఖ్యలు



**ఇంటర్నెట్ డెస్క్:** భారత్‌కు చెందిన పలువురి క్రికెట్ కామెంట్రీపై రోహిత్ శర్మ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. తాజాగా టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికిన సంగతి తెలిసిందే. ఓ పాడ్ కాస్ట్‌లో రోహిత్ మాట్లాడుతూ.. పదేపదే ఒకే క్రికెటర్‌పై దృష్టిపెట్టి, అతడి వ్యక్తిగత జీవితం గురించి కూడా కామెంట్లు చేయడం తగదన్నాడు. అలాకాకుండా ఆటగాడి నైపుణ్యం గురించి విశ్లేషిస్తే బాగుంటుందని వ్యాఖ్యానించాడు. భారత్‌లో కామెంటేటర్లు ఏదొక ఎజెండాతో కామెంట్రీ చేస్తున్నట్లుగా ఉంటుందని పేర్కొన్నాడు. ఇతర దేశాల కామెంట్రీ ఒక్కోసారి బాగుంటుందని కితాబిచ్చాడు. భారత్‌లో క్రికెట్ జర్నలిజం తీరు కూడా మారాల్సిన ఆవశ్యకత ఉందన్నాడు.

"కొంతమంది కేవలం వివాదాలను సృష్టించడంపై, అసలైన వార్తలను గాలికొదిలేయడంపై దృష్టిపెట్టారు. దీని వల్ల నాణ్యమైన జర్నలిజం తగ్గిపోతుంది. ఇంతకుముందు క్రికెట్ చుట్టునే సంభాషణ జరిగేది. ఇప్పుడు మాత్రం తమ వీక్షణలు, లైక్‌లు, కథనాలను ఎక్కువ మంది చదివేందుకు ఇతర వివాదాలను తెరపైకి తీసుకొస్తున్నారు. దీంతో ఆట గురించి రాయడం, మాట్లాడటం తక్కువైంది. వ్యూహాలు, విశ్లేషణ అసలే లేకుండా పోయింది. మనం టీవీల్లో మ్యాచ్ చూస్తున్నామనుకోండి.. ప్రస్తుత రోజుల్లో కామెంటేటర్ల మాటలను వింటే చాలా నిరుత్సాహంగా అనిపిస్తోంది. అదే మీరు ఆస్ట్రేలియా లేదా ఇతర దేశానికి వెళ్లండి. వారి కామెంట్రీ చాలా భిన్నంగా ఉంటుంది. క్వాలిటీలోనూ మెరుగ్గా ఉంటుంది. కానీ, ఇక్కడ మాత్రం అలా సాధ్యం కావడం లేదు. ఏదొక ప్లేయర్‌ను తీసుకొని అతడిపైనే ఎక్కువగా మాట్లాడతారు. అదీనూ వ్యక్తిగత విషయాలను తీసుకొస్తారు. కానీ, చాలా మంది అభిమానులు క్రికెట్ గురించి తెలుసుకోవడానికి ఆసక్తిగా ఉంటారు. వారికెందుకు మీ మసాలా? వారంతా నిజమైన క్రికెట్ ప్రేమికులు. క్రికెటర్ ఎందుకు ఫామ్ కోల్పోయాడు? ఏం తప్పులు చేశాడు? అనేవి చూస్తారు. వారెప్పుడూ ప్లేయర్ల వ్యక్తిగత విషయాలను కోరుకోరు. కానీ, మీరు (కామెంటేటర్లు) మాత్రం ఓ వేదికను చూసుకుని మాట్లాడేస్తారు. ప్లేయర్లకు కాస్త గౌరవం ఇవ్వండి. కొన్నిసార్లు సరైన ప్రదర్శన ఇవ్వలేకపోవచ్చు. అప్పుడు మేం విమర్శలకు అర్హులమే. న్యూజిలాండ్‌తో సరిగ్గా ఆడలేకపోయాం. కానీ, అందుకూ ఓ విధానం ఉంటుంది. అంతేకానీ, ఒక ఎజెండాతో విమర్శలు చేయొద్దు. అది ఎవరికీ నచ్చదు" అని రోహిత్ వ్యాఖ్యానించాడు.

**ఇప్పటికిప్పుడు తీసుకోలేదు: రోహిత్ చిన్ననాటి కోచ్**

"రోహిత్ శర్మ టెస్టులకు వీడ్కోలు పలకాలనే నిర్ణయం ఇప్పటికిప్పుడు తీసుకోలేదు. ఫామ్ కోల్పోవడం వల్లే ఇలాంటి నిర్ణయానికొచ్చాడనే రూమర్లు సరైనవి కావు. తొందరపడి ఏమీ గుడ్‌బై చెప్పలేదు. టీ20ల నుంచి వైదొలిగి కుర్రాళ్లకు ఎలా అవకాశం ఇవ్వాలని అనుకున్నాడో.. అదే తరహాలో టెస్టులను వదిలేశాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్ గెలవాలని ముందు భావించాడు. కానీ, మనం ఫైనల్‌కు అర్హత సాధించలేదు. ఇప్పుడు రోహిత్ టార్గెట్ వన్డే ప్రపంచకప్ 2027పైనే ఉంటుంది. అది గెలిచాక క్రికెట్‌కు వీడ్కోలు చెప్పాలని నేనూ కోరుకుంటున్నా" అని రోహిత్ చిన్ననాటి కోచ్ దినేశ్ లాడ్ వెల్లడించారు.

# తెలుగు భాషపై ప్రవాస భారతీయ పిల్లల ఆసక్తి



మేరీల్యాండ్ లోని బాల్టిమోర్ కేంద్రంలో పరీక్ష రాస్తున్న పిల్లలు



వర్జీనియా కేంద్రంలో పరీక్ష రాస్తున్న పిల్లలు



వాషింగ్టన్, డీసీ పరిసర ప్రాంతాల్లో కొంతమంది వాలంటీర్ టీచర్లు

సిలికాన్ ఆంధ్ర మనబడి మరో ముఖ్యమైన ఘట్టాన్ని చేరుకుంది. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం (పిఎస్ టియు) సర్టిఫికేషన్ పరీక్షను ఇటీవల అమెరికా, కెనడా అంతటా ఏకకాలంలో నిర్వహించగా.. 3,000 మందికి పైగా విద్యార్థులు ఇందులో పాల్గొన్నారు. తెలుగు భాషలో ప్రావీణ్యాన్ని అంచనా వేసే ఈ పరీక్షను పి ఎస్ టి యు (హైదరాబాద్) గుర్తింపు ఇస్తోంది.

ఈ పరీక్ష మనబడి కార్యక్రమంలోని ప్రకాశం (జూనియర్ స్థాయి) ప్రభాసం (సీనియర్ స్థాయి) తరగతుల విద్యార్థులకు తప్పనిసరి. ఈ పరీక్షలో విజయవంతంగా ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు తెలుగు భాషలో విశ్వవిద్యాలయ గుర్తింపు పొందిన సర్టిఫికెట్‌ను అందుకుంటారు. ఇది వారి భాషా నేర్పు, సాంస్కృతిక వారసత్వం పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనం.

ఈ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయడం అంత తేలిక కాదు. ఈ సంవత్సరం ఉత్తర అమెరికా అంతటా వందలాది మంది వాలంటీర్ టీచర్లు, సమన్వయకర్తలు విద్యార్థులను ప్రోత్సహించడం, శిక్షణ ఇవ్వడం బాధ్యతను మోశారు. పరీక్షలో వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం వంటి నాలుగు కౌశల్యాలను అంచనా వేసే విధంగా రూపకల్పన చేశారు.

అమెరికా, కెనడా అంతటా పరీక్ష కేంద్రాలు ఒకే సమయంలో నిర్వహించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం సెంట్రల్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా సీసీటీవీ కెమెరాలతో నిఘా పెట్టబడింది, ఇది సిలికాన్ ఆంధ్ర, పి ఎస్ టి యు సంయుక్తంగా నిర్వహించాయి.

వాషింగ్టన్, డీసీ పరిసర ప్రాంతాల్లో ఈ పరీక్షలో సుమారు 315 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు, ఇది తెలుగు భాష విద్యాపట్ల ఉన్న ఆసక్తిని ప్రతిబింబిస్తోంది.

2007 ఏప్రిల్లో ప్రారంభమైన మనబడి కార్యక్రమం, ప్రవాస భారతీయుల పిల్లలలో తెలుగు భాషను పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి ఏర్పాటు చేయబడింది. గత 17 సంవత్సరాల్లో, ఇది అమెరికా, కెనడా అంతటా 260కి పైగా కేంద్రాల్లో 95,000 మందికి పైగా విద్యార్థులతో విస్తరించింది.

ఇప్పటివరకు 45,000 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా పట్టభద్రులుగా తయారయ్యారు. పి ఎస్ టి యు వంటి విద్యాసంస్థలతో భాగస్వామ్యాల ద్వారా, మనబడి విద్యార్థులకు తెలుగు నేర్చుకునే అవకాశాన్ని మాత్రమే కాకుండా, వైద్య ప్రమాణంతో కూడిన గుర్తింపును అందించగలగడం గర్వకారణం.

ఈ సంవత్సరం పి ఎస్ టి యు పరీక్ష విజయవంతంగా పూర్తి కావడం, మనబడి కార్యక్రమం సముదాయ సహకారం, విద్యా నాణ్యత, సాంస్కృతిక గౌరవం పట్ల ఉన్న నిబద్ధతను మళ్లీ ఒకసారి చాటింది.

**- చప్ప గాంధీ,**
**వాషింగ్టన్, డీసీ**

# 'మీ విజయానికి బాంబులు పేలుస్తాం'

## జైపూర్ క్రికెట్ స్టేడియానికి బెదిరింపు మెయిల్




**ఇంటర్నెట్ డెస్క్:** పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రస్థావరాలపై భారత సైన్యం విరుచుకుపడిన సంగతి తెలిసిందే. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో ఉగ్రస్థావరాలను కుప్పకూల్చింది. దాదాపు 100 మందిని మట్టుబెట్టినట్లు కేంద్రం వెల్లడించింది. దీంతో దేశవ్యాప్తంగా సంబరాలు మిన్నంటాయి. ఇదే సమయంలో జైపూర్ క్రికెట్ స్టేడియానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో భద్రతా దళాలు సెక్యూరిటీని కట్టుదిట్టం చేశాయి. దీనిపై స్టేడియం అధికారులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ప్రస్తుతం ఐపీఎల్ 2025 సీజన్ కొనసాగుతోంది. జైపూర్ వేదికగానే రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. అయితే, మే 16న పంజాబ్ కింగ్స్‌తో రాజస్థాన్ తన చివరి లీగ్‌మ్యాచ్‌ను ఇక్కడే ఆడనుంది.

జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్ స్టేడియం అధికారులకు ఉదయం 9.13 గంటలకు ఓ మెయిల్ వచ్చిందని పోలీసులు వెల్లడించారు. ఇందులో ఆపరేషన్ సిందూర్ గురించి పేర్కొంటూ.. " ఆపరేషన్ సిందూర్ విజయానికి గుర్తుగా మేం మీ స్టేడియంలో బాంబు పేలుడు నిర్వహిస్తాం. వీలైతే ప్రతిఒక్కరినీ కాపాడుకోండి" అంటూ మెయిల్ వచ్చిందని తెలిపారు. ఈ మెయిల్‌పై అధికారిక వర్గాలు విచారణ మొదలుపెట్టాయి.

# "సేఫ్ స్టే" మొబైల్ యాప్ ఆవిష్కరణ

- ప్రజల భద్రతకు కొత్త దిక్సూచి
- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో ప్రారంభం




**అనకాపల్లి, (విశాఖ సమాచారమ్ బ్యూరో):-** ప్రజల భద్రత కోసం అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ మరో ముందడుగు వేసింది. సాంకేతికతను వినియోగిస్తూ, ప్రజల రక్షణను మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్న లక్ష్యంతో "సేఫ్ స్టే"(సముదాయాలను మెరుగైన నిఘాతో రక్షించటం) అనే ప్రత్యేక మొబైల్ యాప్ ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, గురువారం ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా హెూటళ్ళు, లాడ్జీలు మరియు ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లలో తలదాచుకుంటున్న అతిథుల వివరాలను సురక్షితంగా నమోదు చేయవచ్చు. తద్వారా, వారికి నేర చరిత్ర ఉన్నదా లేదా అనే విషయాన్ని పోలీసు డేటాబేస్‌తో సరిపోల్చి, అనుమానాస్పద వ్యక్తులపై ముందస్తు చర్యలు తీసుకునే వీలుంటుంది. ఇది నేరాలు అడ్డుకునే దిశగా కీలక పాత్ర పోషించనుందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించబడింది. ఇందులో "సేఫ్ స్టే" యాప్ వినియోగ విధానం, దాని అమలు సంబంధిత మార్గదర్శకాలు, తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించబడింది. జిల్లాలోని అన్ని హెూటళ్లు, లాడ్జీలు మరియు గెస్ట్ హౌస్‌లు ఈ యాప్ వినియోగాన్ని తప్పనిసరిగా చేపట్టాల్సిందిగా ఎస్పీ ఆదేశించారు. ప్రజల భద్రత పోలీస్ శాఖకు అత్యంత ప్రాధాన్యత" అని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సైబర్/సోషల్ మీడియా సెల్ ఇన్స్పెక్టర్ బెండి వెంకటరావు, ఎస్సై సురేష్ బాబు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# అదంతా సోషల్ మీడియా ప్రచారం : గౌతమ్ గంభీర్




**ఇంటర్నెట్ డెస్క్:** భారత జట్టు టెస్టు కెప్టెన్‌గా ఉన్న రోహిత్ శర్మ సుదీర్ఘ ఫార్మాట్‌కు వీడ్కోలు చెప్పడం క్రికెట్ వర్గాల్లో సంచలనంగా మారింది. రోహిత్ శర్మ టెస్టులకు గుడ్‌బై చెప్పేశాడు. వచ్చే నెలలో ఇంగ్లాండ్‌తో ఐదు టెస్టుల సిరీస్ ఆడాల్సిన క్రమంలో నిర్ణయం తీసుకోవడం ఫ్యాన్స్‌ను ఆశ్చర్యానికి గురిచేసింది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ తనను ఎంపిక చేసే అవకాశాలు తక్కువేనని భావించడంతోనే రోహిత్ వీడ్కోలు పలికినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో సోషల్ మీడియాలో గంభీర్‌తో సయోధ్య లేకపోవడం వల్లే రోహిత్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనిపై గంభీర్ తీవ్రస్థాయిలో స్పందించాడు. ఇదంతా యూట్యూబ్‌లో టీఆర్పీ కోసం చేస్తున్నారని మండిపడ్డాడు.

"అసలు ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నవారంతా ఎవరు? కేవలం సోషల్ మీడియాలోనే ఇలాంటివి వస్తున్నాయి. ఇందులో మాట్లాడే ఎక్స్‌పర్ట్స్ ఎవరు? వీరంతా యూట్యూబ్ ఛానల్ ప్రమోషన్ కోసం, టీఆర్పీ రేటింగ్‌ల కోసమే మాట్లాడతారు. రెండు నెలల కిందట మేం ఛాంపియన్స్ ట్రోఫీని గెలిచాం. ఒకవేళ మేం సాధించకపోయి ఉంటే.. అప్పుడు మీరేం అడిగి ఉండేవారు? కోచ్ - కెప్టెన్ కలిసి ఛాంపియన్‌గా నిలిపాం. ఇలాంటప్పుడు కూడా మీరు నాకు, రోహిత్‌కు మధ్య ఏదో ఉందని ఎలా అడగగలరు?" అని గంభీర్ వ్యాఖ్యానించాడు.

**మా అనుబంధం ఇలా..**

"నేను ఎప్పుడూ మనిషిని మనిషిగానే గౌరవిస్తా. భారత క్రికెట్‌కు అతడేం చేశాడనేది అందరికీ తెలుసు. ఆ విషయంలో రోహిత్‌పై ఎప్పుడూ గౌరవం ఉంటుంది. అతడు జట్టులోకి వచ్చిన తొలినాళ్ల నుంచి చూస్తూనే ఉన్నా. ఇలాంటప్పుడు కూడా పదేపదే మా మధ్య ఉన్న సంబంధాలపై ఇంకా ప్రశ్నలు అడగడం సరైంది కాదు. టీఆర్పీ కోసం, యూట్యూబ్ ఛానల్‌ను నిర్వహించుకోవడానికి ఇలాంటి ప్రశ్నలు అడగాలనుకుంటే అందుకు హెూంవర్క్ చేసుకొని రావాలని చెబుతా" అని గంభీర్ తెలిపాడు. రోహిత్ నాయకత్వంలో వరుసగా రెండు టెస్టు సిరీస్‌లను ఓడిపోవడంతో అప్పుడే అతడిపై వేటు పడుతుందని అంతా భావించారు. ఆస్ట్రేలియా పర్యటన అనంతరం రోహితే వీడ్కోలు చెబుతాడని ఊహించారు. దాదాపు ఐదు నెలల తర్వాత అనూహ్యంగా ఇప్పుడు నిర్ణయం ప్రకటించడం గమనార్హం.

# ఎవరినీ సాయం అడగాలనుకోలేదు : సమంత



ఇంటర్నెట్‌డెస్క్: తన నిర్మాణ సంస్థ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్'లో రూపొందిన తొలి సినిమా 'శుభం' ప్రచారంలో సమంత బిజీగా ఉన్నారు. మే 9న ఈ సినిమా విడుదల కానుంది. ఈ ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె వరుస ఇంటర్వ్యూలు ఇవ్వడంతో ఆమె పేరు ట్రెండ్ అవుతోంది. తన తర్వాతి సినిమా గురించి తాజాగా మాట్లాడారు. అలాగే ఆమె పంచుకున్న కొన్ని ఫొటోలు నెటిజన్‌లను ఆకర్షిస్తున్నాయి.

సమంత కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించి ఏడాది దాటింది. గతేడాది ఆమె పుట్టినరోజు నాడు 'మా ఇంటి బంగారం' అనే సినిమాను ప్రకటించారు. తాజాగా ఆ చిత్రంపై అప్‌డేట్ ఇచ్చారు. జూన్ నుంచి ఆ సినిమా సెట్స్ పైకి వెళ్లనున్నట్లు తెలిపారు. దీనితర్వాత వరుస ప్రాజెక్ట్‌లతో ప్రేక్షకులను అలరించనున్నారు. దీంతో ఆమె తెలుగులో మరోసారి స్ట్రాంగ్ కమ్ బ్యాక్ ఇస్తుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు.

**అందుకే అతిథి పాత్ర..**

'శుభం'లో సమంత అతిథి పాత్రలో కనిపించనున్నారు. దీని గురించి ఆమె మాట్లాడుతూ.. "నేను శుభంలో అతిథి పాత్ర పోషించాల్సింది కాదు. కానీ నిర్మాతగా నా తొలి చిత్రం కోసం నేను ఎవరినీ సాయం అడగాలనుకోలేదు. అందుకే నేనే నటించాను. సినిమాను ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లే బాధ్యతను కూడా నేనే తీసుకున్నాను. రిలీజ్ వరకు మాత్రమే ప్రచారం చేస్తాను. తర్వాత సినిమా పూర్తిగా ప్రేక్షకుల చేతుల్లో ఉంటుంది" అని చెప్పారు.

**కొత్త ఆరంభం..**

నటిగా తనని తాను నిరూపించుకున్న సమంత నిర్మాతగా అదృష్టం పరీక్షించుకోనున్నారు. 'శుభం' విడుదల సందర్భంగా ఆమె కొన్ని ఫొటోలు షేర్ చేశారు. ప్రస్తుతం ఆ ఫొటోలతో పాటు వాటికి ఆమె పెట్టిన క్యాప్షన్ అందరినీ ఆకట్టుకుంటోంది. శుభం టీమ్‌తో పాటు దర్శకుడు రాజ్, దర్శకురాలు నందినిలతో దిగిన ఫొటోలను సమంత షేర్ చేశారు. "ఇది చాలా కష్టమైన ప్రయాణం. ఇక్కడి వరకూ చేరుకున్నాం.




VISAKHA SAMACHARAM Telugu Daily. Edited, Printed, Published & Owned by : S.Veerabhadra Rao , Printed at Suryodaya Publications, VisakhaSamacharam Press
Door No. 9-3-16, Pitapuram Colony, Visakhapatnam-3. Editorial Office : 9393949345, 9346363839, 9160190123, vspnews4@gmail.com